# బలగం TV
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం 02, సెప్టెంబర్-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


## సీఎం రేవంత్ బీసీ వ్యతిరేకి..



## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయండి



### లేదంటే అసెంబ్లీని స్తంభింప జేస్తాం : మాజీ మంత్రి హరీశ్ రావు హెచ్చరిక

**హైదరాబాద్, సెప్టెంబర్ 01:** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలనీ, లేదంటే అసెంబ్లీ సమావేశాలను స్తంబింప జేస్తామని మాజీ మంత్రి హరీశ్‌రావు హెచ్చరించారు. ప్రభుత్వం ఫీజుల బకాయిలు చెల్లించకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను వేధిస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనకు నేటితో వెయ్యి రోజులు పూర్తయ్యాయని పేర్కొంటూ మంగళవారం 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌పై విమర్శలు గుప్పించారు. ప్రతిపక్షాలపై అసత్యాలు ప్రచారం చేయడంపై ఉన్న శ్రద్ధ.. క్షేత్రస్థాయిలో పిల్లలు పడుతున్న గోస మీద ఎందుకు లేదని ప్రశ్నించారు. కష్టపడి చదువుకున్నా సర్టిఫికెట్లు చేతికి రాక.. అటు ఉద్యోగాలకు, ఇటు పైచదువులకు వెళ్లలేక విద్యార్థులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ విధానాల వల్ల రాష్ట్రంలో 960గా ఉన్న ప్రయివేట్ డిగ్రీ కళాశాలల సంఖ్య 650కి పడిపోయిందన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే మరిన్ని కళాశాలలు త్వరలో మూతపడే ప్రమాదముందని హెచ్చరించారు. దీని ప్రభావం అత్యధికంగా గ్రామీణ తెలంగాణపై పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. నెలల తరబడి జీతాలు అందక అధ్యాపకులు, నాన్‌టీచింగ్ సిబ్బంది ఇంబ్బందులు పడుతుంటే, అద్దెలు, విద్యుత్ బిల్లులు, యూనివర్సిటీ ఫీజులు, ఇతర నిర్వహణ ఖర్చులు భరించలేక కళాశాలలు సంక్షోభంలో కూరుకు పోయాయని మిగతా 3లో..

## 1000 రోజుల విధ్వంస పాలన

- విద్యార్థుల భవిష్యత్తుతో సర్కార్ చెలగాటం: హరీశ్
- కాంగ్రెస్ పాలన ప్రజాపీడన: ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- దేవుళ్లపై ఒట్టేసి మరీ కాంగ్రెస్ ధోకా: ప్రశాంత్‌రెడ్డి
- పాలనపై శ్వేతపత్రం రిలీజ్ చేయాలి: కేపీ వివేకానంద

వివరాలు 2లో..

# యూరియా కోసం రైతుల రాస్తారోకో

- నిమిషాల్లో 2 వేల బస్తాలు క్లోజ్..
- ఆగ్రహంతో రోడ్డెక్కిన అన్నదాతలు
- ఆన్‌లైన్ బుకింగ్ తీరుపై మండిపాటు
- స్మార్ట్‌ఫోన్ లేని రైతులకు తీవ్ర ఇబ్బందులు



**హైదరాబాద్, సెప్టెంబర్ 01:** నిమిషాల వ్యవధిలోనే 2 వేల బస్తాల యూరియా క్లోజ్ కావడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు రామాయంపేట-మెదక్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. యూరియా కోసం కష్టాలు పడుతున్న రైతులు రామాయంపేట మండల కేంద్రంలో మంగళవారం ఆందోళనకు దిగారు. యాప్‌లో యూరియా బుక్ అవ్వకపోవడంతో, రైతులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ పంటలకు కీలకమైన సమయంలో ఎరువులు అందక దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంట అదును తప్పిన తర్వాత యూరియా చల్లితే ఆశించిన ఫలితం ఉండదని, సమయానికి ఎరువులు అందకపోవడంతో పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని కన్నీటి పర్యంతమయ్యారు. యూరియా నిల్వలు వచ్చిన విషయాన్ని అధికారులు రైతులకు సమాచారం ఇచ్చేలోపే ఆన్‌లైన్ బుకింగ్ పూర్తవుతోందని రైతులు మండిపడ్డారు. రెండు, మూడు మండలాలకు సంబంధించిన యూరియా నిల్వ లను ఒకేసారి యాప్‌లో చూపిస్తుండటంతో ఇతర ప్రాం తాల రైతులతో పోటీ పడాల్సి వస్తోందని, దీంతో రామాయంపేట మండల రైతులకు యూరియా దక్కకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతోకాలంగా యూరియా కోసం ఎదురుచూస్తున్నా తమకు ఒక్క బస్తా కూడా అందడం లేదని పలువురు వాపోయారు. మండలంలోని ఇతర గ్రామాలతో పోలిస్తే తమ ప్రాంతంపై అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారని ఆరోపించారు. ఆన్‌లైన్ బుకింగ్ విధానం వల్ల స్మార్ట్‌ఫోన్ లేని రైతులు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఓ మహిళా రైతు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ పనులు వదిలి యూరియా కోసం రోజుల తరబడి ఎదురుచూడాల్సి వస్తోందని రైతులు తెలిపారు. యూరియా సమస్యతో మిగతా 3లో..

## ఉద్యోగుల ఉద్యమ బాట

- మాటతప్పిన కాంగ్రెస్ సర్కార్‌పై సీపీఎస్ ఉద్యోగుల సమరశంఖం
- రాష్ట్రవ్యాప్తంగా పెన్షన్ విద్రోహదినం.. కార్యాలయాల్లో నిరసనలు
- సచివాలయంలో ఉద్యోగుల ధర్నా.. ప్రధాన గేటు వద్ద బైఠాయింపు
- ఆరు డీఏల పెండింగ్‌పై ఆగ్రహం.. సీపీఎస్ రద్దు హామీపై నిలదీత
- ఇందిరాపార్క్ వద్ద పీఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో టీచర్ల ధర్నా
- సర్కార్ దిగిరాకపోతే లక్షమందితో హైదరాబాద్ ముట్టడి: జేఏసీ

వివరాలు 2లో..

### కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కొనసాగింపుపై

# హైకోర్టు కీలక ఆదేశాలు..!!




**హైదరాబాద్, సెప్టెంబర్ 01:** కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలపై తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఊరట లభించింది. ఈ రెండు పథకాలపై సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను సీజే ధర్మాసనం ఎత్తివేసింది. ఈ పథకాల అమలుపై హైకోర్టు సింగిల్ ధర్మాసనం విధించిన స్టేను సవాల్ చేస్తూ రాష్ట్ర సర్కార్.. డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేయగా.. ఈరోజు విచారణ జరిగింది. ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ వాదనలు వినిపించారు. కాగా, ధర్మాసనం ఈ రోజు ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణలో అమలవుతున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలును నిలిపివేస్తూ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర స్టే ఉత్తర్వులను ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని డివిజన్ బెంచ్ మంగళవారం రద్దు చేసింది. దీంతో ఈ పథకాల కొనసాగింపునకు మార్గం సుగమమైంది. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించి 2014 నుంచి ప్రభుత్వం జారీ చేసిన ఎనిమిది జీవోలను సవాలు చేస్తూ విజయ్ గోపాల్ అనే న్యాయవాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మిగతా 3లో..

# నలుగురికి పదవీగండం..

- జాబితాలో అడ్లూరి, కొండా, జూపల్లి, పొన్నం!



**హైదరాబాద్, సెప్టెంబర్ 01:** రాష్ట్ర మంత్రివర్గంలో భారీ ప్రక్షాళన దిశగా కసరత్తు జరుగుతున్నదా? అసమర్థ, అవినీతి ముద్రతో ఒక దళిత, ఇద్దరు బీసీ మంత్రులను బయటికి పంపే ప్రయత్నాలు జరుగుతున్నయా? ముఖ్యమంత్రి శిబిరం ఇప్పటికే దళిత మంత్రి మీద ఒత్తిడి తెస్తున్నదా? స్పీకర్ మార్పు నుంచి కీలక శాఖల పునర్విభజన వరకు ఏఐసీసీ కసరత్తు చేస్తున్నదా? ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిపాలనా తీరును పదే పదే విమర్శించే అగ్రవర్ణ సామాజిక వర్గ నేతకు మంత్రి పదవి ఇవ్వక తప్పని పరిస్థితి ఏర్పడిందా? ఆయనకు మంత్రి పదవి ఇస్తే, తన శాఖను మార్చడంతోపాటు తన భార్యకు డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వాల్సిందేనని అదే జిల్లా అగ్రవర్ణ సామాజిక వర్గానికే చెందిన సీనియర్ మంత్రి పట్టుబడుతున్నారా? ఈసారి ప్రక్షాళనలో నలుగురు మంత్రులకు ఉద్వాసన తప్పదా? అంటే ఇటీవల గాంధీభవన్ నుంచి ఢిల్లీ అధిష్ఠానం దాకా సాగుతున్న తాజా రాజకీయ పరిణామాలు 'అవును' అనే సంకేతాలే ఇస్తున్నాయి. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ముగిసిన వెంటనే తెలంగాణ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ మొదలుపెట్టాలని ఏఐసీసీ ఆలోచనతో ఉన్నట్టు తెలిసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై 1,000 రోజులు పూర్తయిన నేపథ్యంలో మంత్రివర్గంలో భారీ మార్పులు, చేర్పులు చేపట్టేందుకు అధిష్ఠానం మిగతా 3లో..

# నేటినుంచి బీఆర్ఎస్ పోరుబాట

**హైదరాబాద్, సెప్టెంబర్ 01:** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు సిద్ధమైం ది. నేటి నుంచి వారం రోజుల పాటు సాగే ఈ కార్యక్ర మాల్లో హామీల అమలు, పాలనా వైఫల్యాలను ప్రజ ల్లోకి తీసుకెళ్లను న్నారు. హైదరాబాద్‌లో కేటీఆర్కాం గ్రెస్ పాలనపై ఛార్జ్ షీట్ విడుదల చేయనున్నారు. ఆరు గ్యారెంటీల వైఫల్యాలపై నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు, ఫ్లెక్సీల ప్రదర్శనతో పాటు, ప్రజలకు బకాయి ఉన్న హామీలను గుర్తుచేస్తూ బాకీ కార్డుల పంపిణీ చేపట్టనుంది.




# పంజాబ్‌కు మీనాక్షి..

### 'సర్' ప్రక్రియ ముగియగానే తెలంగాణకు వీడ్కోలు!



**హైదరాబాద్, సెప్టెంబర్ 01:** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ బాధ్యతల నుంచి మీనాక్షీనటరాజన్ త్వరలోనే తప్పుకోనున్నట్టు అత్యంత విశ్వ సనీయంగా తెలిసింది. రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ పూర్తి కాగానే ఆమె తెలంగాణకు వీడోలు పలుకనున్నారని సమాచారం. రానున్న కాలంలో మిగతా 3లో..

# రేవంత్ పాలన..వెయ్యి రోజుల వంచన

### బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్



**హైదరాబాద్, సెప్టెంబర్ 01:** ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వెయ్యి రోజుల పాలన, వెయ్యి రోజుల వంచన అని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారం చేపట్టి వెయ్యి రోజులు గడుస్తున్నా తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోలేక బీఆర్ఎస్ నేతలను తిట్టేందుకే కోట్లాది రూపాయల ప్రజాధనంతో సభలు పెడుతున్నారని ఎద్దేవా చేశారు.రేవంత్ వెయ్యి రోజుల పీడనపై మిర్యాల గూడలో ఏర్పాటు చేయనున్న కే టీఆర్ సభకు అనుమతి ఎందుకు నిరాకరించారని ప్రశ్నించారు. మత పరమైన ఊరేగింపులు ఉంటే తప్ప సెక్షన్ 30 పెట్టరనీ, రాష్ట్రంలో ఆ సెక్షన్ ఎందుకు పెట్టారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నేత ను రాజీనామా చేయమంటూ ర్యాలీలకు పిలుపునిస్తే సెక్షన్ 30 వర్తించదా అంటూ నిలదీశారు. తెలంగాణను మూడు భాగాలుగా విభజించి సీఎం మంత్రులు పంచుకుంటున్నారని ఆరోపించారు. సీఎం అక్రమ ఆదేశాలను డీజీపీతో పాటు పోలీసు అధికారులు పాటించకుం డా బీఆర్ఎస్ సభలు, సమావేశాలకు అనుతివ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎప్పుడు కూలిపోతుందో అనే భయంతోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నేత కేసీఆర్ పై వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మిగతా 3లో..

### హైడ్రా ఛీఫ్ రంగనాథ్ తొలగింపుపై

# హైకోర్టు కీలక నిర్ణయం..!

**హైదరాబాద్, సెప్టెంబర్ 01:** హైదరాబాద్ లో అక్రమ కట్టడాల తొలగింపు కోసం తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ను.. తమ ఆదేశాలను పదే పదే ధిక్కరిస్తున్నారన్న కారణంతో హైకోర్టు పక్కనబెట్టాలని ప్రభుత్వానికి ఆదేశాలు ఇచ్చింది. గతంలో ఆయన తీసుకున్న నిర్ణయాలు, కోర్టు ఇచ్చిన ఆదేశాలను ధిక్కరిస్తున్న తీరు ఆధారంగా హైకోర్టు సింగిల్ బెంచ్ జడ్జి ఈ మేరకు ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేశారు. అయితే వీటిపై రంగనాథ్ హైకోర్టు డివిజన్ బెంచ్ ను ఆశ్రయిం చారు. ఈ పిటిషన్ పై విచారణ జరిపిన హైకోర్టు.. ఇవాళ కీలక తీర్పు వెలువరించింది. హైదరాబాద్ లోని శాంతా శ్రీరాం కన్ స్ట్రక్షన్స్ కేసులో హైడ్రా కమిషనర్ గా ఉన్న ఏవీ రంగనాథ్ ను ఆ పదవి నుంచి తప్పించి, మరొకరిని నియమించాలంటూ గతంలో హైకోర్టు సింగిల్ జడ్జి బెంచ్ ఇచ్చిన తీర్పును డివిజన్ బెంచ్ ఇవాళ తాత్కాలికంగా పక్కనబెట్టింది. ఈ మేరకు రంగనాథ్ కు భారీ ఊరటనిచ్చింది. దీంతో ప్రభుత్వం ఇప్పటికిప్పుడు కొత్త హైడ్రాఛీఫ్ కోసం వెతుక్కోవాల్సిన అవసరం లేకుండా పోయింది. ఈ కేసులో తదుపరి విచారణను నవంబర్ 3కు వాయిదా వేస్తూ హైకోర్టు నిర్ణయం తీసుకుంది. హైడ్రా ఛీఫ్ గా ఉన్న రంగనాథ్.. మల్కాజిగిరి మండలం లోతుకుంటలో కూల్చివేతలు చేపట్టడాన్ని సవాల్ చేస్తూ శాంతా శ్రీరాం కన్ స్ట్రక్షన్స్ సంస్థ హైకోర్టును ఆశ్రయించింది. గతంలో ఈ కూల్చివేతలకు మిగతా 3లో..




# రిటైర్డ్ ఆర్టీసీ కార్మికులకు త్వరలో బెనిఫిట్స్ చెల్లిస్తాం

- పేదల ఇండ్ల కోసం ఆర్టీసీ స్థలాలు ఇస్తే తప్పేంది?
- 'మహాలక్ష్మి' కింద ఆర్టీసీకి 10 వేల కోట్లు ఇచ్చాం
- మీడియాతో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



వివరాలు 2లో..

# ఉద్యోగుల ఉద్యమ బాట

- మాటతప్పిన కాంగ్రెస్ స ర్కార్‌పై సీపీఎస్ ఉద్యోగుల సమరశంఖం
- రాష్ట్రవ్యాప్తంగా పెన్షన్ విద్రోహదినం.. కార్యాలయాల్లో నిరసనలు
- సచివాలయంలో ఉద్యోగుల ధర్నా.. ప్రధాన గేటు వద్ద బైఠాయింపు
- ఆరు డీఏల పెండింగ్‌పై ఆగ్రహం.. సీపీఎస్ రద్దు హామీపై నిలదీత
- ఇందిరాపార్క్ వద్ద పీఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో టీచర్ల ధర్నా
- సర్కార్ దిగిరాకపోతే లక్షమందితో హైదరాబాద్ ముట్టడి: జేఏసీ



హైదరాబాద్, సెప్టెంబర్ 01: నివురుగప్పిన నిప్పులా ఉన్న ఆగ్రహం ఒక్కసారిగా కట్టలు తెంచుకున్నది. తమ హక్కుల కోసం, న్యాయబద్ధంగా రావాల్సిన పీఆర్సీ, డీఏల కోసం ఉద్యోగులు కదంతొక్కారు. పాలనకు కేంద్రబిందువైన సచివాలయంలో ఉద్యోగులు బైఠాయించారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ సెక్రటేరియట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులందరూ ఏకమై భోజన విరామ సమయంలో సచివాలయ ప్రధాన 'బాహుబలి' ద్వారం వద్ద బైఠాయించి ఆకస్మిక ధర్నాకు దిగారు. 'ఉద్యోగుల మహాగర్జన' పేరుతో నిర్వహించిన ఈ ధర్నాతో సచివాలయ ప్రాంగణం దద్దరిల్లింది. మూడేండ్లు గడుస్తున్నా పీఆర్సీ అమలుకు నోచుకోలేదని, రికార్డుస్థాయిలో 6 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని ఉద్యోగ సంఘాల నేతలు ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరిస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదని విమర్శించారు. ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగుల బెనిఫిట్స్, ఉద్యోగుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, హెల్త్‌కార్డుల సమస్యను పరిష్కరించాలని, ఇండ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్న ఉద్యోగులు భిక్షాటన చేసి నిరసన తెలిపారు.సచివాలయం మీడియా పాయింట్ వద్ద సెక్రటేరియట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గిరి శ్రీనివాస్‌రెడ్డి, ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సురేశ్‌కుమార్, టీజీఎస్ఏ జనరల్ సెక్రటరీ ప్రేమ్ దేవేందర్, అసోసియేషన్ ప్రెసిడెంట్ రమాదేవి మాట్లాడుతూ మే 2న ఉద్యోగ సంఘాలతో సమావేశమైన సీఎం రేవంత్ రెడ్డి సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించినప్పటికీ, నాలుగు నెలలు గడిచినా ఎలాంటి పురోగతి లేకపోవడం శోచనీయమని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడే భాష సరిగా లేదని, ఉద్యోగులు ప్రభుత్వాన్ని భయపెడుతున్నారంటూ వ్యాఖ్యానించడం తగదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.గత ముఖ్యమంత్రులు ఎవరూ ఇలా మాట్లాడలేదని, న్యాయమైన హకుల కోసమే పోరాడుతున్నామని స్పష్టం చేశారు. ఏడాదికాలంగా ప్రమోషన్లు కల్పించకుండా ఉన్నతాధికారులు అడ్డుపడుతున్నారని తెలిపారు. ప్రతినెలా జీతాలు ఇచ్చినంత మాత్రాన గొప్ప కాదని, రిటైర్డ్ ఉద్యోగులు తమ హకుల కోసం ఆఫీసుల చుట్టూ తిరిగే దుస్థితి నెలకొన్నదని ధ్వజమెత్తారు. ఈ ఆందోళన ప్రారంభం మాత్రమేనని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## రాయ్‌దుర్గ్ వక్ఫ్ భూముల పరిరక్షణే ధ్యేయం



హైదరాబాద్, సెప్టెంబర్ 01: హైదరాబాద్ రాయ్‌దుర్గ్ ప్రాంతంలోని చారిత్రక జామియా నిజామియా వక్ఫ్ భూముల పరిరక్షణకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు హరీశ్‌రావు తెలిపారు. రాయ్‌దుర్గ్ వక్ఫ్ ప్రొటెక్షన్ జేఏసీ కన్వీనర్ అబ్దుల్ వాహబ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం మంగళవారం కలిసింది. అత్యంత విలువైన వక్ఫ్ భూములను రేవంత్ సర్కార్ విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నదని, వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో భూముల పరిరక్షణపై ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలని జేఏసీ నేతలు కోరారు. వారి విజ్ఞప్తిపై హరీశ్‌రావు సానుకూలంగా స్పందించారు. భూముల పరిరక్షణ కోసం జేఏసీ ఈ నెల 13న హైదరాబాద్‌లో తలపెట్టిన భారీ ధర్నాకు మద్దతిస్తు న్నట్టు హరీశ్‌రావు వెల్లడించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో చేపట్టే ఈ నిరసన పోరాటంలో తమ శ్రేణులు భాగస్వామ్యమవుతాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జేఏసీ కో-కన్వీనర్, టీఎస్‌ఎంహెచ్ పీఏస్ రాష్ట్ర సమన్వయకర్త అబ్రార్ హుస్సేన్, ఎస్ డీపీఐ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ మన్సూర్ షా, టీఎస్‌ఎంహెచ్ పీఏస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండీ వాజిద్, వక్ఫ్ ప్రొటెక్షన్ సెల్ నేత నయీముల్లా షరీఫ్ పాల్గొన్నారు.

## సింగరేణిలో మెడికల్ బోర్డులు నిర్వహించాలి..



- టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో నిరసనలు
- నల్ల బ్యాడ్జీలు ధరించి అధికారులకు వినతులు

హైదరాబాద్, సెప్టెంబర్ 01: సింగరేణిలో ప్రతి నెలా క్రమం తప్పకుండా మెడికల్ బోర్డులు నిర్వహించి, అనారోగ్యంతో దరఖాస్తు చేసుకున్న కార్మికులను అన్‌ఫిట్ చేయాలని మంగళవారం టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో సింగరేణి వ్యాప్తంగా కార్మికులు నిరసన తెలిపారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ఆర్జీ-1 ఏరియాలోని జీడీకే-1, 2, 2ఏ, ఓసీ 5, జీడీకే 11 ఇంక్లైన్, ఏరియా వర్క్‌షాప్, సివిల్ డిపార్ట్‌మెంట్, అనలాటికల్ ల్యాబ్, ఆర్జీ-2, 3 ఏరియాల్లో కార్మికులు, ఎస్‌పీసీ విభాగంలో నల్ల బ్యాడ్జీలు ధరించారు. అనంతరం హెచ్‌వోడీలకు వినతిపత్రాలను అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం హెడ్డాఫీసు పరిధిలోని సెంట్రల్, మెయిన్ వర్క్‌షాపుల్లో కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సింగరేణిలో రద్దు చేసిన డిపెండెంట్ ఉద్యోగాల స్థానంలో కేసీఆర్ హయాంలో కారుణ్య నియామకాలు ప్రవేశపెట్టారని, 13వేల కార్మికుల మెడికల్ ఇన్‌వాలిడేట్ జరిగిందని, ఫలితంగా వేలాది కార్మిక కుటుంబాలకు న్యాయం జరిగిందన్నారు. వందశాతం మెడికల్ అన్‌ఫిట్ చేయిస్తామని, ప్రతినెలా కనీసం మూడు మెడికల్ బోర్డులు నిర్వహిస్తామని కాంగ్రెస్, ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ హామీలు ఇచ్చి ఆచరణలో 10 శాతానికి మించి చేయడంలేదని ధ్వజమెత్తారు. ఆయా కార్యక్రమాల్లో ఏరియా ఉపాధ్యక్షుడు తుమ్మ శ్రీనివాస్‌రావు, సంఘ నాయకులు కంచర్ల శ్రీనివాస్, ప్రసాద్, రవివర్మ, సూర్యనారాయణ, అమరేందర్ పాల్గొన్నారు.

## 1000 రోజుల విధ్వంస పాలన




- విద్యార్థుల భవిష్యత్తుతో సర్కార్ చెలగాటం: హరీశ్
- కాంగ్రెస్ పాలన ప్రజాపీడన: ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- దేవుళ్లపై ఒట్టేసి మరీ కాంగ్రెస్ ధోకా: ప్రశాంత్‌రెడ్డి
- పాలనపై శ్వేతపత్రం రిలీజ్ చేయాలి: కేపీ వివేకానంద

హైదరాబాద్, సెప్టెంబర్ 01: కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ప్రజలకు చేసిన మేలు కంటే.. సృష్టించిన విధ్వంసమే ఎకువని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. ప్రతిపక్షాలను తిట్టడం, అసత్య ప్రచారాలకే ప్రాధాన్యం ఇస్తున్న కాంగ్రెస్ సర్కార్.. క్షేత్రస్థాయిలో విద్యార్థులు పడుతున్న గోసపై ఎందుకు శ్రద్ధ చూపడం లేదు? అని ప్రశ్నించారు. ప్రపంచస్థాయి విద్యావ్యవస్థ అంటూ గొప్పలు చెప్పుకొనే సీఎం రేవంత్‌రెడ్డి.. నెలలు గడుస్తున్నా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఇప్పటికి మూడు బడ్జెట్లు పూర్తయినా.. దాదాపు రూ.10 వేల కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. బకాయిలు పేరుకుపోవడంతో ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చికుకున్నాయని పేర్కొన్నారు. ఒకప్పుడు రాష్ట్రంలో సుమారు 960 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు ఉండగా.. ప్రస్తుతం ఆ సంఖ్య దాదాపు 650కి పడిపోయిందని చెప్పారు. ఇదే పరిస్థితి కొనసాగితే మరిన్ని కళాశాలలు మూతపడే ప్రమాదం ఉన్నదని మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. కొన్ని కళాశాలల్లో 5 నుంచి 10 నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు తమ దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో కొన్ని కళాశాలలు విద్యార్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆరోపించారు. దీంతో ఉద్యోగాలకు వెళ్లలేక.. పైచదువులకు చేరలేక వారి భవిష్యత్తు అంధకారంలో పడితే బాధ్యత ఎవరిదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినప్పుడు రూ.2,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని హరీశ్‌రావు గుర్తుచేశారు. కేసీఆర్ తొమ్మిదిన్నరేండ్ల పాలనలో గత కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన బకాయిలతో కలిపి రూ.19,500 కోట్లు చెల్లించారని తెలిపారు. సిద్దిపేటలోని శ్రీకృప కాలేజీ విద్యార్థులతోపాటు రాష్ట్రవ్యాప్తంగా సర్టిఫికెట్లు అందక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్న వీడియోను ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## 1000 రోజుల దగాపై నేడు చార్జ్‌షీట్..

### విడుదల చేయనున్న కేటీఆర్



హైదరాబాద్, సెప్టెంబర్ 01: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల దగా పాలనపై బీఆర్ఎస్ పోరుబాట పట్టనున్నది. అలవికాని హామీలు ఇచ్చి వెయ్యి రోజులు గడిచినా అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై చార్జ్‌షీట్ వేయనున్నది. బుధవారం ఉదయం 11గంటలకు తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు చార్జ్‌షీట్‌ను విడుదల చేయ నున్నారు. చార్జ్‌షీట్‌తోపాటు 420 హామీలు, ఆరు గ్యారెంటీల అమలును ప్రశ్ని స్తూ ఈ నెల 8వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా వరుస నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు బీఆర్ఎస్ సేన సిద్ధమైంది. చార్జ్‌షీట్‌తో మొదలయ్యే ఈ పోరాటాన్ని ప్రజాఉద్యమంగా మార్చాలని బీఆర్ఎస్ వ్యూహం రచించింది. బుధవారం నుంచి ధర్నాలు, రైతు సదస్సులు, వంటావార్పులు, యువత ర్యాలీలు, ఆటో ర్యాలీలు, ప్ర జావాణి వినతిపత్రాలు.. ఇలా ప్రతిరోజూ ఒకో అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చుట్టుముట్టేలా బీఆర్ఎస్ కార్యాచరణను సిద్ధం చే సింది. ఈ మేరకు మాజీ మంత్రులు, రాష్ట్ర నేతలు ఎక్కడికక్కడ పార్టీ సన్నాహక సమావేశాల ద్వారా శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

## రిటైర్డ్ ఆర్టీసీ కార్మికులకు త్వరలో బెనిఫిట్స్ చెల్లిస్తాం

- పేదల ఇండ్ల కోసం ఆర్టీసీ స్థలాలు ఇస్తే తప్పేంది?
- 'మహాలక్ష్మి' కింద ఆర్టీసీకి 10 వేల కోట్లు ఇచ్చాం
- మీడియాతో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్, సెప్టెంబర్ 01: ఆర్టీసీలో రిటైరైన కార్మికులకు ఉద్యోగ విరమణ ప్రయోజనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం నిజమేనని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అంగీకరించారు. వారికి డబ్బులు చెల్లించే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. కాంగ్రెస్ సర్కార్ 1,000 రోజుల పాలనలో ఆర్టీసీ, రవాణా శాఖల అభివృద్ధిపై మంగళవారం ఆయన బస్‌భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ఇటీవల ప్రభుత్వం ఆర్టీసీకి చెందిన కొన్ని భూములను తీసుకోవడాన్ని మంత్రి పొన్నం ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ.. 'రాష్ట్రంలోని పేదలకు మేము ఇండ్లు కట్టొద్దా? ప్రభుత్వం నుంచి ఆర్టీసీ వందల ఎకరాలను తీసుకుంటున్నప్పుడు 5, 10 ఎకరాలు అడిగితే ఇవ్వొద్దా? ఇందులోతప్పేమున్నది?' అని ప్రశ్నించారు.ప్రభుత్వ విధానాలు అర్థంచేసుకోవడం'మహాలక్ష్మి' పథకం అమల్లో భాగంగా ఆర్టీసీకి ఇవ్వాల్సిన రూ.12,167 కోట్లలో ఇప్పటికే రూ.10 వేల కోట్లు అందజేశామని తెలిపారు. ఉమ్మడి ఆస్తుల విభజనకు సంబంధించిన అంశాలపై ఇప్పటికే ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రులు మాట్లాడుకున్నారని, దీంతో చాలా సమస్యలు సమసిపోయాయని చెప్పారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనానికి సానుకూలంగానే ఉన్నామని, ఈ అంశంపై రివ్యూ కమిటీ సమర్పించే నివేదిక ఆధారంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. సమావేశంలో రవాణా శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్, ఆర్టీసీ ఎండీ వై నాగిరెడ్డి, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, జేటీసీ చంద్రశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ బీసీ వ్యతిరేకి..

### ఫీజు బకాయిలు ఎప్పుడిస్తరు: ఆర్ కృష్ణయ్య



హైదరాబాద్, సెప్టెంబర్ 01: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థుల ఫీజుల బకాయిలను ఎప్పుడిస్తరని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య ప్రశ్నించారు. మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర బీసీ యువజన సంఘం అధ్యక్షుడు జిల్లపల్లి అంజి నాయకత్వంలో వేలాది మంది విద్యార్థులు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ ఫీజు బకాయిలు రూ.8 వేల కోట్లు చెల్లించడానికి సీఎం ఇంత రాద్ధాంతం దేనికి చేస్తున్నారని నిలదీశారు. గతంలో పాలించిన 18 మంది ముఖ్యమంత్రులలో ఎవరు కూడా ఇలాంటి బీసీ వ్యతిరేక చర్యలకు పాల్పడలేదని చెప్పారు.

## సమాచార, పౌర సంబదాల శాఖ అదనపు సంచాలకులుగా డి.ఎస్. జగన్

హైదరాబాద్, సెప్టెంబర్ 01: సమాచార, పౌర సంబంధాల శాఖలో డి.ఎస్. జగన్ అదనపు సంచాలకుడిగా పదోన్నతి పొందారు. పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన అనంతరం ఆయన బాధ్యతలు స్వీకరించారు.బాధ్యతలు స్వీకరించిన అనంతరం డి.ఎస్. జగన్ డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గౌరవ రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి డి.ఎస్. జగన్‌కు పదోన్నతి సందర్భంగా అభినందనలు తెలియజేశారు.సమాచార, పౌర సంబంధాల శాఖ ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరవేయడంతో పాటు ప్రభుత్వం, ప్రజలు, మీడియా మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని మంత్రి ఆకాంక్షించారు.అనంతరం డి.ఎస్. జగన్ సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ డా. జి. ముకుంద రెడ్డి గారిని కూడా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్పెషల్ కమిషనర్ ఆయనకు పదోన్నతి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.అదనపు సంచాలకుడిగా బాధ్యతలు స్వీకరించిన డి.ఎస్. జగన్ మాట్లాడుతూ, తనపై ప్రభుత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా విధులను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలకు విస్తృతంగా చేరవేయడంలో శాఖ అధికారులతో సమన్వయంతో పనిచేస్తానని పేర్కొన్నారు.ఈ సందర్భంగా సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులు, సిబ్బంది డి.ఎస్. జగన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## సీఎం రేవంత్‌వి చిల్లర రాజకీయాలు

- విమర్శిస్తే వైఫల్యాలు మరుగునపడవు
- నేటి నుంచి నిరసనలు : సబితా ఇంద్రారెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 01: అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నా హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ సర్కార్ ఘోరంగా విఫలమైందని, అందుకే ప్రజావ్యతిరేకత నుంచి దృష్టి మళ్లించేందుకే సీఎం రేవంత్‌రెడ్డి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని బీఆర్ఎస్ శాసనసభా పక్ష ఉప నేత సబితాఇంద్రారెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మూసారాంబాగ్ వంతెన ప్రారంభోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై ముఖ్యమంత్రి దిగుజారుడు విమర్శలు చేయడాన్ని మంగళవారం ఒక ప్రకటనలో ఆమె తీవ్రంగా ఖండించారు. కేసీఆర్‌పై విమర్శలు చేసినంత మాత్రాన కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు మరుగునపడవని, పాలనపై దృష్టిపెట్టకుండా ప్రతిపక్షాన్ని తిట్టడమే పనిగా పెట్టుకోవడం ప్రభుత్వ దివాలాకోరుతనానికి నిదర్శనమని విమర్శించారు. తెలంగాణను ప్రగతి పథంలో నిలిపిన కేసీఆర్ ముద్రను ప్రజల గుండెల నుంచి చెరిపివేయడం రేవంత్‌రెడ్డి వల్ల కాదని స్పష్టంచేశారు. విమర్శలు, చిల్లర రాజకీయాలు పకన బెట్టి, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై సీఎం దృష్టిపెట్టాలని సబితారెడ్డి హితవు పలికారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక సాయానికి అదనంగా తులం బంగారం ఇస్తామని ఆశచూపి ఓట్లు దండుకున్న కాంగ్రెస్, అధికారంలోకి వచ్చాక ఆ హామీని పూర్తిగా బుట్టదాఖలు చేసిందని ఆరోపించారు. బంగారం ఇవ్వడం దేవుడెరుగు, గతంలో ఇచ్చిన సాయాన్ని కూడా ఎత్తివేసేలా కుయుక్తులు పన్నుతున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ చేస్తున్న ఈ వంచనను, చౌకబారు జిమ్మికులను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌కు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.ఎన్నికల వేళ ఇచ్చిన 6 గ్యారెంటీలతోపాటు 420కి పైగా హామీలను గాలికి వదిలేసి రైతులు, మహిళలు, విద్యార్థులు, యువత, దివ్యాంగులను మోసగించిన ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు ఇవాళ్టి నుంచి 8వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ నిరసనలు చేపడుతున్నట్టు సబితారెడ్డి వెల్లడించారు.

## చేయూత పింఛన్ల దరఖాస్తుల గడువు పొడిగింపు

హైదరాబాద్: చేయూత పింఛన్ల దరఖాస్తుల గడువును తెలంగాణ ప్రభుత్వం పొడిగించింది. సెప్టెంబర్ 15 వరకు గడువు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. చేయూత పథకం కింద కొత్త సామాజిక పెన్షన్ల కోసం ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరిస్తోంది. రాష్ట్రంలో కొత్తగా 2.50 లక్షల మందికి కొత్త పెన్షన్లు ఇవ్వాలని నిర్ణయించింది. దీనికి అనుగుణంగా ఈ నెల 9వ తేదీ నుంచి 5 కేటగిరిల్లో దరఖాస్తులను ఆహ్వానించింది. నేటితో గడువు ముగియగా.. దరఖాస్తు చేయని వారు ఇంకా ఉండటంతో వారి అభ్యర్థన మేరకు గడువు పొడిగించింది. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, పట్టణాలు, నగరాల్లో బిల్ కలెక్టర్లు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తారు.

## (మొదటిపేజీ తరువాయి)

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయండి

పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చే నాటికి రూ. 2,500 కోట్ల ఫీజు రియింబర్స్ మెంట్ బకాయిలు ఉంటే, వాటిని చెల్లించి ఆ పథకాన్ని కొనసాగించినట్టు గుర్తు చేశారు. పెద్ద నోట్ల రద్దు జరిగినా, కరోనా విపత్తు వచ్చినా తాము ఫీజు రియింబర్స్ మెంట్ ఆపలేదన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు భరోసాగా నిలిచిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు.

## యూరియా కోసం రైతుల రాస్తారోకో

వ్యవసాయం చేయడమే భారంగా మారిందని తెలిపారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి స్థానిక రైతులకు సరిపడా యూరియాను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. యూరియా కొరత ఇలాగే కొనసాగితే పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు.

### రామాయంపేట-మెదక్ రహదారిపై రాస్తారోకో

యూరియా సమస్యతో రైతులు రామాయంపేట-మెదక్ రహదారిపై రాస్తారోకో నిర్వహించడంతో రహదారిపై ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. రైతులను సముదాయించి ఆందోళన విరమింపజేశారు. వెంటనే అధికారులు స్పందించి యూరియా సరఫరా సమస్యను పరిష్కరించాలని, లేకపోతే తమ పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## హైకోర్టు కీలక ఆదేశాలు..!!

ఈ పిటిషన్‌పై ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయకపోవడంతో, విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి పథకాల అమలుపై మధ్యంతర స్టే విధించారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ (ఏజీ) సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ, ఈ పథకాలు 2014 నుంచి నిరంతరాయంగా అమలవుతున్నాయని, పిటిషనర్ లబ్ధిదారుడు కానందున ఆయనకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని కోర్టుకు తెలిపారు. ఇది ప్రజాప్రయోజన వ్యాజ్యం కాదని, ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలపై దాఖలైన ఇలాంటి వ్యాజ్యాలను డివిజన్ బెంచ్ మాత్రమే విచారించాలని వాదించారు. షాదీ ముబారక్ వంటి పథకాలకు సుప్రీంకోర్టు కూడా గతంలో అనుమతినిచ్చిందని వివరించారు. దీంతో, అడ్వకేట్ జనరల్ వాదనలతో ఏకీభవించిన డివిజన్ బెంచ్, సింగిల్ జడ్జి ఇచ్చిన స్టే ఉత్తర్వులను ఎత్తివేస్తూ తీర్పునిచ్చింది. హైకోర్టు తాజా నిర్ణయంతో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలు రాష్ట్రవ్యాప్తంగా యథావిధిగా కొనసాగించేందుకు మార్గం సుగమం అయింది.

## నలుగురికి పదవీగండం..



కసరత్తు చేస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. ప్రస్తుతం కొనసాగుతున్న మంత్రుల్లో దళిత మంత్రి అడ్లూరి లక్ష్మణ్, బీసీ మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, మరో మంత్రి జూపల్లి కృష్ణారావును మంత్రివర్గం నుంచి తప్పిస్తారని, వారి స్థానంలో కొత్తవారికి అవకాశం కల్పిస్తారని సీఎం అనుకూల శిబిరం లీకులు వదులుతున్నది. ప్రస్తుతం అసెంబ్లీ స్పీకర్‌గా కొనసాగుతున్న వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్‌ను మంత్రివర్గంలోకి తీసుకొని, ఆయన స్థానంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన దళిత మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను స్పీకర్‌గా ఎంపిక చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భావిస్తున్నట్టు సమాచారం. స్పీకర్ పదవిని స్వీకరించాలని ఇప్పటికే మంత్రి అడ్లూరి మీద సీఎం శిబిరం తీవ్ర ఒత్తిడి తెస్తున్నట్టు కాంగ్రెస్ శ్రేణుల్లో ప్రచారం జరుగుతున్నది.

## పంజాబ్‌కు మీనాక్షి..

ఆమెను పంజాబ్ రాష్ట్ర ఏఐసీసీ దూతగా పూర్తిస్థాయి బాధ్యతల్లోకి పంపేందుకు అధిష్ఠానం రంగం సిద్ధం చేసినట్టు తెలిసింది.కొంతకాలంగా తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాలపై మీనాక్షీనటరాజన్ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు గాంధీభవన్ శ్రేణుల్లో చర్చ నడుస్తున్నది. గతంలో తాను రాజ్యసభ ఎంపీగా ఎన్నికయ్యే అవకాశం దకకుండా రాష్ట్రానికి చెందిన కొందరు కీలక నేతలు వ్యూహాత్మకంగా వ్యవహరించి వెన్నుపోటు పొడిచారనే అసహనం ఆమెలో గూడుకట్టుకొని ఉన్నదని సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో తెలంగాణలో కొనసాగడం తనకు ఏమాత్రం ఇష్టం లేదని ఆమె ఇప్పటికే అగ్రనేత రాహుల్‌గాంధీ వద్ద స్పష్టంచేసినట్టు ప్రచారం జరుగుతున్నది.మరోవైపు, పంజాబ్ రాజకీయాలపై ఏఐసీసీ ప్రత్యేక దృష్టి సారించింది. అకడ నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ అంతర్గత పరిస్థితులను క్షేత్రస్థాయిలో సమీక్షించి అధిష్ఠానానికి నివేదిక సమర్పించేందుకు ఏఐసీసీ ముగ్గురు సభ్యుల పరిశీలకుల బృందాన్ని నియమించింది. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదేశాల మేరకు ఏర్పాటైన ఈ పరిశీలకుల కమిటీలో మీనాక్షీనటరాజన్‌తోపాటు సీనియర్ నేత అజయ్‌మాకెన్, భజన్‌లాల్ జాతవ్ ఉన్నారు. ఇప్పటికే పంజాబ్ రాజకీయ సమీక్షలతో ఆమె పూర్తిగా బిజీ అయిపోయారు. తెలంగాణలో చేపట్టిన కీలక 'సర్' ప్రక్రియ ముగిసిన వెంటనే ఆమె పూర్తిస్థాయిలో పంజాబ్ కాంగ్రెస్ రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించనున్నట్టు తెలుస్తున్నది.

## హైకోర్టు కీలక నిర్ణయం..!




వ్యతిరేకంగా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను ఆయన ధిక్కరించారంటూ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి బెంచ్.. గతంలో రంగనాథ్ పదే పదే హైకోర్టు ఉత్తర్వులు ఉల్లంఘించడాన్ని సీరియస్‌గా తీసుకుంది. ముఖ్యంగా ఏడాదిన్నరలో 63 కోర్టు ధిక్కారణ పిటిషన్ లు ఆయనపై నమోదు కావడాన్ని తీవ్రంగా పరిగణించింది. దీంతో రంగనాథ్ ను తప్పించి మరో సమరుథడైన అధికారిని హైడ్రా చీఫ్ గా నియమించాలని ప్రభుత్వానికి సూచించింది. దీనిపై హైకోర్టు డివిజన్ బెంచ్ లో రంగనాథ్ కు ఇవాళ ఊరట లభించింది.

## రేవంత్ పాలన..వెయ్యి రోజుల వంచన

మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం దిగజారుడు బాషను తెలంగాణ సమాజం గమనిస్తోందన్నారు. తగిన సమయంలో ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి సోదరులు, అనుచరులు, డ్రైవర్లు రాజ్యాంగేతర శక్తిగా మారారని ఆరోపించారు. వెయ్యి రోజుల పాలనపై అసెంబ్లీలో చర్చకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు.

# యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు

- భరణిపాడులో సొసైటీకి తాళం
- రామాయంపేటలో రాస్తారోకో
- కామారెడ్డి జిల్లా మాచారెడ్డి, పాల్వంచ, సిరిసిల్ల జిల్లా కోరెంలో నిరసన



హైదరాబాద్, సెప్టెంబర్ 01: యూరియా కోసం రైతులు రోడ్డెక్కుతున్నారు. యాప్‌లో బుక్ కాకపోవడం, సమయానికి బస్తాలు దొరక్క పోవడంతో ఆగ్రహించిన రైతులు ఆందోళనకు దిగుతున్నారు. యాప్ విధానం రద్దు చేసి, సొసైటీ పరిధిలోని రైతులందరికీ యూరియా సక్రమంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఖమ్మం జిల్లా వేంసూరు మండలం భరణిపాడులో రైతులు సొసైటీ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. సొసైటీ పరిధిలోని రైతులకు యూరియా అందించకుండా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని ఆరోపించారు.ప్రభుత్వం యాప్ విధానం తేవడంతో ఇతర మండలాలు, పొరుగునే ఉన్న ఏపీ రాష్ట్రానికి చెందిన రైతులు కూడా బుక్ చేసుకోవడం వల్ల, సొసైటీ సభ్యులుగా ఉన్న తమకు యూరియా దొరకడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. బ్లాక్ మార్కెట్‌కు యూరియా తరలిస్తున్నారనే ఆరోపణలపై అధికారులు విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం సొసైటీ కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలిపారు. యూరియా యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలోనిమెదక్-రామాయంపేట రోడ్డుపై బైఠాయించారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు కూడా ఎరువులు లభించడం లేదని మండిపడ్డారు. యూరియా ఇచ్చే వరకు రోడ్డుపై నుంచి కదిలేది లేదని భీష్మించారు. ఎస్సై-2 సురేశ్‌కుమార్ వచ్చి సముదాయించినా వినలేదు. ఎరువులు వచ్చేలా తాను ప్రయత్నం చేస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.కాగా కామారెడ్డి జిల్లా మాచారెడ్డి, పాల్వంచ మండలాలోన్లూ రైతులు రోడ్డెక్కారు. మాచారెడ్డి సొసైటీ పరిధిలోని ఏడు విక్రయ కేంద్రాల్లో స్టాక్ అందుబాటులో ఉన్నా బుక్ కావడం లేదని మండిపడ్డారు. యాప్ రద్దు చేసి పాత పద్ధతిలోనే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కాగా రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం కోరెం సొసైటీ వద్ద రైతులు నిరసనకు దిగారు. సొసైటీకి సోమవారం 900 బస్తాల యూరియా వచ్చిందని, కోరెం, దుంద్రపల్లి, అనంతపల్లి, మలాపూర్ రైతులు మంగళవారం ఉదయం 10:15కు యాప్‌లో బుక్ చేసుకోవాలని అధికారులు సూచించా రు. వారు చెప్పినట్టుగానే యాప్ ఓపెన్ చేశామని, రెండు నిమిషాల్లో 900 బస్తాలు అయిపోయాయని, సొసైటీకి వచ్చి అడిగితే స్టాక్‌లేదని చెప్పారంటూ మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సొసైటీ ముందు నిరసన తెలిపారు.

## లక్ష మందితో హైదరాబాద్‌ను దిగ్బంధిస్తాం..




- ప్రభుత్వం దిగివచ్చే వరకు పోరాటం
- ప్రభుత్వానికి ఎంప్లాయిస్ జేఏసీ హెచ్చరిక
- సర్కార్‌పై సీపీఎస్ ఉద్యోగుల సమరశంఖం
- రాష్ట్రవ్యాప్తంగా పెన్షన్ విద్రోహ దినోత్సవం

హైదరాబాద్, సెప్టెంబర్ 01: ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 10న లక్ష మంది ఉద్యోగులతో హైదరాబాద్‌ను దిగ్బంధం చేస్తామని తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ హెచ్చరించింది. 'చలో హైదరాబాద్'లో భాగంగా హైదరాబాద్‌ను ముట్టడిస్తామని ప్రకటించింది. ప్రభుత్వం దిగివచ్చేవరకు పోరాటం తప్పదని అల్టిమేటం జారీ చేసింది. సీపీఎస్‌ను రద్దు చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో జేఏసీ మంగళవారం ఆందోళనకు దిగింది. కాంగ్రెస్ సర్కార్‌పై సమర శంఖం పూరించిన ఉద్యోగులు నిరసనలు హోరెత్తించారు. రాష్ట్రంలోని మండల, డివిజన్, జిల్లా కార్యాలయాల ఎదుట నల్లబ్యాడ్జీలు, జెండాలతో ఆందోళనకు దిగారు. హైదరాబాద్‌లోని గగన్‌విహార్, బీమాభవన్, హైదరాబాద్ కలెక్టరేట్, అర్థ గణాంకశాఖ కార్యాలయాల ఎదుట జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఆందోళనకు దిగారు. నిరసనల్లో ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి ఎస్ఎం హుస్సేని(ముజీబ్), టీజీవో అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, ప్రధానకార్యదర్శి బీ శ్యామ్, ముత్యాల సత్యనారాయణగౌడ్, కట్కూరి శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, సదానందంగౌడ్, ఎంబీ కృష్ణా యాదవ్, విక్రమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన టోలీచౌకీ ఎస్ఐ



హైదరాబాద్, సెప్టెంబర్ 01: హైదరాబాద్‌లోని టోలీచౌకీ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా పనిచేస్తున్న ఆర్ పాండునాయక్ లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖకు అడ్డంగా దొరికిపోయాడు. వివరాల్లోకి వెళ్తే.. గోల్కొండ జమాలి కుంట ప్రాంతానికి చెందిన ఓ కుటుంబంలో గత నెల 28న గొడవ జరిగింది. దీనిపై ఆ కుటుంబ సభ్యుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఆ సమస్యను సామరస్యంగా పరిష్కరిస్తానని, ఫిర్యాదుదారుడి తల్లిపై కేసు నమోదు చేయకుండా ఉండేందుకు, పాస్‌పోర్టును స్వాధీనం చేసుకోకుండా ఉండేందుకు రూ.10 వేలు లంచం ఇవ్వాలని పాండునాయక్ డిమాండ్ చేశాడు.మంగళవారం సాయంత్రం ఫిర్యాదుదారుడి నుంచి ఆ లంచాన్ని పుచ్చుకుంటున్న పాండునాయక్‌ను ఏసీబీ డీఎస్పీ మాజిద్ తన బృందంతో కలిసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం ఆయనను రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## బీఆర్ఎస్ ధర్నాకు దిగొచ్చిన సర్కార్

- సాగు నీటిని సరఫరా చేయాలని పెద్దవూరలో
- మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ ఆధ్వర్యంలో ధర్నా
- నీటి విడుదల చేయాలని అధికారులకు ఆదేశం



హైదరాబాద్, సెప్టెంబర్ 01: సాగు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ చేపట్టిన ధర్నాకు ప్రభుత్వం దిగివచ్చింది. నల్లగొండ జిల్లా నాగార్జున సాగర్ నియోజకవర్గంలోని రైతుల సాగునీటి సమస్యను పరిషరించాలని, ఎస్ఎల్‌బీసీ లోలెవెల్ కెనాల్‌కు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ ఆధ్వర్యంలో మంగళవారం రైతులు పెద్దవూరలోని హైదరాబాద్-సాగర్ హైవేపై ధర్నా చేపట్టారు.భగత్ మాట్లాడుతూ.. సాగు, తాగునీటి అవసరాలను తీర్చడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా వందలాది టీఎంసీల తరలిస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం దిగివచ్చి వరద కాలువకు నీటిని విడుదల చేయాలని అధికారులను ఆదేశించింది.

## నత్తనడకన సర్ నోటీసుల జారీ..

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వెల్లడి
- 92.88 లక్షల నోటీసుల్లో ఇప్పటివరకు పంపిణీ చేసింది 31.74 లక్షలే
- 1.94 లక్షల నోటీసులపై విచారణ పూర్తి



హైదరాబాద్, సెప్టెంబర్ 01: రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో భాగంగా జరుగుతున్న నోటీసుల పంపిణీ ప్రక్రియ నత్తనడకన సాగుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా 92.88 లక్షల మంది ఓటర్లకు నోటీసులు పంపిణీ చేయాల్సి ఉండగా.. ఇప్పటివరకు 31.74 లక్షలు (34 శాతం) మాత్రమే పంపిణీ అయ్యాయి. వీటిలో 1.94 లక్షల (2 శాతం) నోటీసులపై మాత్రమే విచారణ పూర్తయినట్టు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సుదర్శన్‌రెడ్డి మంగళవారం ప్రకటించారు. మిగిలిన నోటీసులను దశలవారీగా ఓటర్లకు అందజేస్తామని, రాష్ట్రవ్యా ప్తంగా 1,973 ఏఈఆర్‌వోలు, 119 ఈఆర్‌వోలు ఈ ప్రక్రియను నిర్వహిస్తారని తెలిపారు.ముసాయిదా ఓటరు జాబితాలను సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్వో) కార్యాలయాలతోపాటు సీఈవో వెబ్‌సైట్ (https:// ceotelangana. nic.in)లోనూ అందుబాటులో ఉంచామని, వీటిపై సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు దాఖలు చేయవచ్చని పేర్కొన్నారు. క్లెయిమ్స్, అభ్యంతరాల పరిషార ప్రక్రియ అక్టోబర్ 15 వరకు కొనసాగుతుందని, ఇప్పటివరకు మొత్తం 9,07,292 క్లెయిమ్స్, అభ్యంతరాలు అందాయని వివరించారు. క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ కోసం 5, 6, 12, 13న పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

## 22ఏ నుంచి తొలగించండి..

### సీసీఎల్ఏ కమిషనర్‌ను కలిసిన మర్రి రాజశేఖర్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 01: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలో 22ఏ నిషేధిత జాబితాలో చేర్చిన నిజమైన ఆస్తులను జాబితా నుంచి తొలగించి న్యాయం చేయాలని మల్కా జిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సచివాలయంలో సీసీఎల్ కమిషనర్ లోకేష్‌ను మంగళవారం కోరారు. నియోజకవర్గంలోని వివిధ కాలనీల సర్వే నెంబర్లు, ప్రైవేట్ ఆస్తుల వివరాలతో కూడిన వినతి పత్రాన్ని ఎమ్మెల్యే అందజేశారు. నిషేధిత జాబితాలో చేర్చిన ప్రైవేట్ ఆస్తుల యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న దృష్ట్యా చట్టబద్ధంగా కొనుగోలు చేసిన, స్వంత హక్కులు కలిగి ఉన్న ఆస్తులను నిషేధిత జాబితా నుంచి తొలగించి ఆయా కుటుంబాలకు న్యాయం చేయాలని కమిషనర్‌ను కోరారు. ఎమ్మెల్యే సమర్పించిన పత్రాలు, వివరాలను పరిశీలించిన సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్‌కుమార్ తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు.



సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్‌కుమార్ తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు.

# విద్యార్థులపై కేసులు కొట్టివేత

- దేశవ్యాప్తంగా నమోదైన అన్ని ఎఫ్ఐఆర్‌లు రద్దు చేసిన సుప్రీంకోర్టు
- ఆర్టికల్ 142 ప్రత్యేక అధికారాలు వినియోగించుకున్న న్యాయస్థానం
- 'నీట్' నిరసనకారులకు భారీ ఊరట



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 01: విద్యార్థి నిరసనకారులకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. వారిపై నమోదైన అన్ని ఎఫ్ఐఆర్‌లను రద్దు చేస్తున్నట్టు సుప్రీంకోర్టు ప్రకటించింది. అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్‌తో కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా జరిగిన పేపర్ లీక్ వ్యతిరేక నిరసనల సందర్భంగా జూలై 20-25 మధ్య జరిగిన ఘటనలకు సంబంధించి యువ నిరసనకారులపై నమోదైన అన్ని ఎఫ్ఐఆర్‌లను రద్దు చేయడానికి సుప్రీంకోర్టు మంగళవారం రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద తనకున్న అసాధారణ అధికారాలను వినియోగించుకుంది.నిరసనల సమయంలో శారీరక హాని, లేదా ఆస్తి విధ్వంసానికి పాల్పడిన నేరాలలో ప్రమేయం ఉన్నట్టు దర్యాప్తులో రుజువైతేనే తీవ్రమైన నేర చరిత్ర ఉన్నట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న 2,873 మందిపై కొత్తగా ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి అనుమతి కోరుతూ ఢిల్లీ పోలీసులు దాఖలు చేసిన ఒక ప్రత్యేక పిటిషన్‌ను ప్రభుత్వం గతంలో కోర్టు ముందు ఉంచింది. ఈ అభ్యర్థన ఢిల్లీకి మాత్రమే ప్రత్యేకమైనదని పేర్కొన్న కేంద్రం అటువంటి నేరాల్లో ప్రమేయం ఉన్నట్టు నిర్ధారణ అయితే ఆ 2,873 మంది వ్యక్తులపై మాత్రమే కొత్తగా ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి అనుమతి ఇవ్వాలని కోరింది.నష్టపరిహారం.నీట్ ప్రశ్నపత్రం లీకేజ్ కారణంగా ఆత్మ హత్యకు పాల్పడిన అభ్యర్థుల కుటుంబాలకు నష్టపరి హారం చెల్లింపునకు సంబంధించి రాష్ట్రాలు, కేంద్రపా లిత ప్రాంతాలతో సంప్రదించిన అఖిల భారత యం త్రాంగానికి సంబంధించిన విధివిధానా లను రూపొందించాలని, ఆ చట్రాన్ని నష్టపరిహార చర్యలకు ఒక సాధారణ యంత్రాంగంగా స్వీకరిం చాలని కోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టు తీర్పుపై సీజేపీ హర్షం వ్యక్తం చేసింది.

ట్ ప్రశ్నపత్రం లీకేజ్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన అన్ని ఎఫ్ఐఆర్‌లను కొట్టివేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే సంపూర్ణ న్యాయంగా అభివర్ణించారు. ఇది విద్యార్థుల విజయమని ఆయన పేర్కొన్నారు. దేశవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చిన సీజేపీ ఇప్పుడు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతించింది. విద్యార్థులపై నమోదైన అన్యా యమైన కేసులను సుప్రీంకోర్టు కొట్టివేసింది. మా డిమాండ్లకు గుర్తింపు లభించింది. ఏ విద్యార్థీ ఇటువంటి చర్యలను ఎదుర్కొనే పరిస్థితి రాదు అని సీజేపీ పేర్కొంది. తమ డిమాండ్లు నెరవేరాయని, ఈ సంపూర్ణ న్యాయం దక్కడానికి నెలరోజులు పట్టిందని దీప్కే పేర్కొన్నారు.

## సంపూర్ణ న్యాయం..
## సుప్రీం తీర్పుపై సీజేపీ



# కేసీఆర్ కోసం మూడేళ్ళలో కోట్లరూపాయల ఖర్చు..

## రాజీనామా డిమాండ్..
## సీఎం రేవంత్ కొత్త రాజకీయం!



హైదరాబాద్, సెప్టెంబర్ 01: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యర్థి పార్టీ ని టార్గెట్ చేయటానికి కొత్త ప్లాన్ చేశారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను టార్గెట్ చెయ్యాలని, నిరసనలకు బీఆర్ఎస్ పిలుపునిచ్చిన క్రమంలో ఆయన బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎంను టార్గెట్ చేశారు. కేసీఆర్ ప్రజా సమస్యల కోసం పని చేయకపోతే ప్రతిపక్ష నేత ఎలా అవుతారని టార్గెట్ చేసిన రేవంత్ రెడ్డి కేసీఆర్ రిజైన్ చెయ్యాలని డిమాండ్ చేశారు. తాజాగా అంబర్‌పేటలో మూసీ నదిపై రూ.52 కోట్లతో నిర్మించిన కొత్త వంతెనను ప్రారంభించారు. ఆ తర్వాత అక్కడే జరిగిన ప్రజా సభలో బీఆర్ఎస్ అధినేత, ప్రతిపక్ష నేత కేసీఆర్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు.ఒక ఉద్యోగి ఏడాది పని చేయకపోతే తొలగిస్తారు. కానీ కేసీఆర్ గత వెయ్యి రోజుల్లో జీతం, భద్రత, వాహనాల కోసం ప్రభుత్వం నుంచి కోట్లు తీసుకున్నారు. మూడేళ్ళలో కేసీఆర్ తీసుకున్న జీతం, భద్రతకు అయిన ఖర్చుల లెక్క చెప్పిన సీఎం ఈ మూడేళ్ళలో కేసీఆర్ ఒక కోటి 84 లక్షల, 40 వేలు జీతంగా తీసుకున్నారని, వాహనాలు భద్రతా సిబ్బంది కోసం ప్రభుత్వం ఇప్పటివరకు 22 కోట్ల 24 లక్షల 40 వేల రూపాయలు ఖర్చు చేసిందని అన్నారు. అయినా ఒక్క రోజు కూడా ప్రజల కోసం, రాష్ట్రం కోసం బయటకు రాలేదు. ఫామ్‌హౌస్‌కు పరిమితమయ్యారు. వెంటనే రాజీనామా చేయాలి" అని సీఎం రేవంత్ రెడ్డి కేసీ ఆర్ ను టార్గెట్ చేశారు. కేసీఆర్ రాజీనామా చెయ్యాలన్న డిమాండ్ తో ర్యాలీలు కేసీఆర్ రాజీనామా డిమాండ్ తో కాంగ్రెస్ కార్యకర్తలు సెప్టెంబర్ 1 నుంచి 5 వరకు మండల, జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు, నిరసనలు చేపట్టాలని, 6న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద పెద్ద సభ నిర్వహించాలని పిలుపునిచ్చారు. 7 నుంచి మొదలయ్యే అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ తప్పక రావాలని, పదేళ్ల పాలన, వెయ్యి రోజుల పాలనపై చర్చ జరపాలని సవాలు విసిరారు. తాను ఒక్క రోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్నానన్నారు. కుటుంబ సభ్యులకు కాకుండా కార్యకర్తలకు, వివిధ వర్గాలకు పదవులు ఇచ్చానని చెప్పుకొచ్చారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచేసిందని, తమ ప్రభుత్వం చెరువులు కాపాడుతూ, పేదలకు నగరంలోనే ఇళ్లు నిర్మిస్తోందని చెప్పారు. ఇప్పటివరకు మూడేళ్ళలో ఏ మాత్రం ప్రజల కోసం కేసీఆర్ పని చెయ్యలేదని సీఎం రేవంత్ టార్గెట్ చేసి కార్యకర్తలకు ర్యాలీలకు పిలుపునివ్వటంతో రాష్ట్ర వ్యాప్తంగా రచ్చ కొనసాగుతుంది.

## నీసముద్ర మట్టాల పెరుగుదలతో కోల్‌కతా, ముంబైకి ముప్పు



న్యూఢిల్లీ: సముద్ర మట్టాలు పెరుతున్న కారణంగా భారతదేశంలోని కోల్‌కతా, ముంబై నగరాలలో లక్షలాది మంది ప్రజలు తమ ఇళ్లను కోల్పోయే ప్రమాదం ఉన్నదని ఐక్యరాజ్యసమితి తన తాజా నివేదికలో వెల్లడించింది. 'సముద్ర మట్టాల పెరుగుదల కు సంబంధించిన సవాళ్లు, దానిని పరిష్కరిం చే మారా గలు, విధానాలు' అనేశీర్షికతో ఐరాస జనరల్ సెక్రటరీ విడుదల చేసిన నివేదిక ప్రకారం సముద్ర మట్టాల పెరుగు దల ఇకపై సుదూర ముప్పు కాదని, చరిత్రలో ఎన్నడూ లేనంత వేగంగా ఇప్పుడు జరుగుతోందని స్పష్టమవుతున్నది. అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలన్నింటికీ ఇది పెను సవాలుగా మారింది.

## అవసరమైతేనే బంగారం కొనండి
### ప్రజలకు మోదీ మళ్లీ విజ్ఞప్తి
### విదేశీ యాత్రలు వద్దని సూచన



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1: బంగారం కొనుగోళ్ల విషయంలో ప్రజలకు ప్రధాని మోదీ మరోసారి కీలక విజ్ఞప్తి చేశారు. అవసరం లేకపోతే బంగారం కొనకూడదు అని సోషల్ మీడియాలో విడుదల చేసిన వీడియోలో పిలుపునిచ్చారు. మే 11న కూడా ప్రధాని ఇదే రకమైన విజ్ఞప్తి చేశారు. ప్రజల సంకల్ప బలాన్ని, కఠోర శ్రమను కూడా మోదీ ప్రశంసించారు. ఇది మన సామూహిక శక్తిని నిదర్శనమని ఆయన చెప్పారు. ప్రపంచమంతా యుద్ధాలతో చుట్టుముట్టి ఉందని ఆయన పేర్కొన్నారు. దేశంలోని కొందరు వ్యక్తులు అబద్ధాలను ఉపయోగించి నిరాశను వ్యాప్తి చేయడానికి, వాతావరణాన్ని పాడుచేయడానికి ప్రయత్నిస్తున్నారని మోదీ ఆరోపించారు. విదేశీ యాత్రలు వద్దు సెలవుల కోసం విదేశాలకు వెళ్లడం, విదేశాల్లో వివాహాలు చేసుకోవడం వంటివి ప్రజలు మానుకోవాలని ఆయన సూచించారు. ప్రజలు మేక్ ఇన్ ఇండియా మంత్రంతో ముందుకు సాగాలని, అవసరం లేకపోతే ప్రజలు బంగారం కొనకూడదని ఆయన అన్నారు.

## వాణిజ్య సిలిండర్‌పై రూ.11.50 వడ్డన
### ఏటీఎఫ్, సీఎన్‌జీ, పీఎన్‌జీ ధరలూ పెరుగుదల

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1: దేశీయ విమానయాన సంస్థలు ఉపయోగించే ఏవియేషన్ టర్బైన్ ఇంధనం(ఏటీఎఫ్)తోపాటు, హోటళ్లు, రెస్టారెంట్లలో ఉపయోగించే వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్లు, వాహనాలకు ఇంధనంగా ఉపయోగపడే సీఎన్‌జీ, గృహాలు, పరిశ్రమలకు భూగర్భ పైపులైన్ల ద్వారా సరఫరా చేసే పీఎన్‌జీ ధరలు మంగళవారం నుంచి పెరిగాయి. ఏటీఎఫ్ ధర లీటర్‌కు రూ.6.28(5.46 శాతం) పెరిగి రూ. 121.28కి చేరింది.ప్రభుత్వ రంగ చమురు సంస్థల గణాంకాల ప్రకారం ఈ ఏడాది ఆగస్టు 1న లీటర్‌కు రూ.5 పెంపు తర్వాత తాజా పెంపు చోటుచేసుకుంది. విమానయాన సంస్థల నిర్వహణ వ్యయంలో ఏటీఎఫ్ వాటా 40 శాతం వరకు ఉంటుంది. ఇది ఆ సంస్థలపై ఖర్చుల భారాన్ని పెంచుతుంది.

కాగా వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ ధరలు కూడా పెరిగాయి. 19 కిలోల సిలిండర్ ధర రూ.9.50 పెరిగి రూ.2,747.50కి చేరగా, 5 కిలోల ఫ్రీ ట్రేడ్ ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.2 పెరిగి రూ.764కి చేరుకుంది.పశ్చిమాసియా సంక్షోభ సమయంలో ధరలు భారీగా పెరిగిన తర్వాత తాజాగా మరోసారి ధరల పెంపు చోటుచేసుకుంది. ఫిబ్రవరి, జూన్ మధ్య కాలంలో 19 కిలోల వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.1,740.50 నుంచి రూ.3,113. 50కి పెరిగింది. అంటే రూ.1,373 మేర పెరుగుదల నమోదైంది. ప్రధాన నగరాల్లో కూడా ధరలు పెరిగాయి. ముంబైలో 19 కిలోల సిలిండర్ ధర రూ.9.50 పెరిగి రూ.2,701కి చేరింది. కోల్‌కతాలో రూ.11.50 పెరిగి రూ.2,884కి, అలాగే చెన్నైలో రూ.10.50 పెరిగి రూ.2,916.50కి ధరలు చేరాయి. అయితే 14.2 కిలోల గృహ వినియోగ ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.942 వద్ద యథాతథంగా కొనసాగుతున్నది. దీని ధరలో చివరిసారిగా జూన్ 7న సిలిండర్‌కు రూ.29 మేర పెంపు జరిగింది.మహానగర్ గ్యాస్ లిమిటెడ్ మంగళవారం నుంచి సీఎన్‌జీ ధరలను కిలోకు రూ.2, దేశీయ పీఎన్‌జీ ధరలను ప్రతి స్టాండర్డ్ క్యూబిక్ మీటర్‌కు రూ.1 పెంచింది. ముంబై, దాని పరిసర ప్రాంతాలలో సీఎన్‌జీ ధర ఇప్పుడు కిలోకు రూ.88గా ఉంది. ఈ పీఎన్‌జీ ధరల పెంపు సుమారు 30 లక్షల దేశీయ వినియోగదారు లకు వర్తిస్తుంది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయ ధరలతో ముడిపడి ఉన్న అధిక ఇన్‌పుట్ గ్యాస్ ఖర్చులనే ధరల పెంపునకు కారణంగా కంపెనీ పేర్కొంది.

# గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తెలంగాణా..

### విదేశీ వర్సిటీలతో వరుస ఒప్పందాలు!



తెలంగాణను గ్లోబల్ నాలెడ్జ్ హబ్ గా మార్చే లక్ష్యంతో తెలంగాణా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తుంది. ఈ మేరకు ప్రభుత్వ లక్ష్య సాధనకు విద్యార్థుల మెరుగైన విద్యా, ఉద్యోగ అవకాశాల కోసం రాష్ట్ర విశ్వవిద్యాలయాలు విదేశీ ఉన్నత విద్యాసంస్థలతో వేగంగా అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాయి. ఇటీవల వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జర్మనీకి చెందిన ప్రతిష్ఠాత్మక రూట్లింగెన్ యూనివర్సిటీతో కీలక ఒప్పందాలు చేసుకుంది.ఈ ఒప్పందాల ద్వారా '3ం2' విద్యా నమూనా ప్రవేశపెట్టారు. విద్యార్థులు మొదటి మూడేళ్ల డిగ్రీని స్థానిక విశ్వవిద్యాలయాల్లో పూర్తి చేసి, తర్వాత రెండేళ్ల మాస్టర్స్ కోర్సును జర్మనీలో అభ్యసిస్తారు. కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్, డిజిటల్ బిజినెస్ మేనేజ్‌మెంట్ వంటి కోర్సుల్లో విద్యార్థులకు ఈ మేరకు అవకాశాలు ఉన్నాయి. కోర్సు పూర్తయిన తర్వాత జర్మనీ విశ్వవిద్యాలయమే మాస్టర్స్ డిగ్రీ అందిస్తుంది. ఏటా 20మంది విద్యార్థులు రూట్లింగెన్ యూనివర్సిటీలో మాస్టర్స్ఈ విధానంలో కాకతీయ యూనివర్సిటీ నుంచి ఏటా 20 మంది విద్యార్థులు ఎంపికవుతారు. ఇంతకు ముందు తెలంగాణ ఉన్నత విద్యా శాఖ బృం దం జర్మనీలోని =ఔెఎ ఆచెన్, ఆస్ట్‌ఫాలియా, గొట్టింగెన్ విశ్వవిద్యాలయాలను సందర్శించి లెటర్స్ ఆఫ్ ఇంటెంట్ మార్పిడి చేసుకుంది. విద్యార్థి-అధ్యాపకుల మార్పిడి, ఉమ్మడి పరిశోధనలు, డ్యూయల్ డిగ్రీలు తదితర అంశాలపై కీలక నిర్ణయాలను తీసుకు ని తదనుగుణంగా చేసిన ప్లాన్ కు ఓకే అన్నారు.

### పలు విదేశీ యూనివర్సిటీలు
### హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్‌లు

అంతేకాదు బోస్టన్ లోని నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీ , యూనివర్సిటీ ఆఫ్ లండన్ హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్‌లు ఏర్పాటు చేయనున్నాయి. హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, ఎంఐటీ, ఎల్ఎస్ఈ వంటి ప్రముఖ సంస్థలతో కూడా వివిధ యూనివర్సిటీలతో చర్చలు సాగు తున్నాయి. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివ ర్సిటీ జపాన్‌లోని హిరోషిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీతో భాగస్వామ్యం కుదుర్చుకుంది.ఈ అంతర్జాతీయ సహకారాలు విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్య, ఉద్యోగ ఉపాధి అవకాశాలు అందించి తెలంగాణను గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా నిలబెట్టే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ నిర్ణయంతో విద్యార్థులు మన యూనివర్సిటీల నుండే విదేశీ వర్సిటీలలో చదువుకోవటానికి సువర్ణావకాశం లభిస్తుంది.

# ఎస్సీ, ఎస్టీలకు పథకాలు అందేలా చూడాలి..



**-అట్రాసిటీ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి..**
**-ప్రతి మూడు నెలలకోసారి విజిలెన్స్ కమిటీ సమావేశం**
**-రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:**

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారలను ఆదేశించారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యుడు రాంబాబు నాయక్‌కు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేశ్ బి. గితె స్వాగతం పలికారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, సంక్షేమ పథకాల అమలు, రిజర్వేషన్లు తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్బంగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ

అట్రాసిటీ కేసుల దర్యాప్తును త్వరితగతిన, పారదర్శకంగా పూర్తి చేసి బాధితులకు నష్టపరిహారం అందేలా చూడాలని ఆదేశించారు. ప్రతి నెల చివరి వారంలో మండలాల్లో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించి ప్రజలకు ఎస్సీ, ఎస్టీల హక్కులు, చట్టాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి మూడు నెలలకోసారి జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించాలని అన్నారు.గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఎస్‌బీఐ ఖాతాలు తెరిపించాలని,దీంతో వారికి భీమా సౌకర్యం కల్పించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అధికారులు మరింత కృషి చేయాలని కోరారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అందరికీ సమన్యాయం చేస్తూ విద్యార్థులు, ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తున్నారని అభినందించారు. ఎస్సీ, ఎస్టీలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ఎస్సీ, ఎస్టీలకు క్షేత్రస్థాయిలో అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పాఠశాలలు, వసతి విద్యాలయాల్లో ప్రతిరోజూ కామన్ మెనూ అమలు చేస్తున్నామని అన్నారు . ప్రత్యేక అధికారులతో తనిఖీలు నిర్వహిస్తూ, విద్యార్థులతో కలిసి భోజనం చేసేలా చూస్తున్నామని తెలిపారు. సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు.ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలు, కులాంతర వివాహాల ఆర్థిక సహాయం, అంబేద్కర్ విదేశీ విద్యా పథకం కింద ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు .

ఎస్పీ మహేశ్ బి. గితె మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు 32 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదైనట్లు పోలీసు అధికారులు తెలిపారు. కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

జిల్లాలో ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఎస్‌డీఎఫ్ కింద ఎస్సీలకు 169 పనులకు రూ.4.29 కోట్లు, ఎస్టీలకు 38 పనులకు రూ.89 లక్షలు మంజూరైనట్లు వెల్లడించారు. ఈ ఏడాది 32 అట్రాసిటీ కేసులు నమోదైనట్లు తెలిపారు.

ఎస్సీ వసతి గృహాల్లో 702 మంది, ఎస్టీ వసతి గృహాల్లో 148 మంది విద్యార్థులు చదువుతున్నట్లు పేర్కొన్నారు. సోషల్ వెల్ఫేర్ విద్యాసంస్థల్లో 3,527 మంది ఎస్సీ, 245 మంది ఎస్టీ విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నట్లు తెలిపారు.

ఎస్టీ విద్యార్థులకు ప్రీ మెట్రిక్ ఉపకార వేతనాల కింద 61 మందికి రూ.17.82 లక్షలు, పోస్ట్ మెట్రిక్ కింద 871 మందికి రూ.2 కోట్లు మంజూరయ్యాయి. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద 2,315 మంది ఎస్సీలు, 436 మంది ఎస్టీలకు ఇళ్లు మంజూరయ్యాయని,

టీ ప్రైడ్ పథకం కింద ఎస్సీలకు 233 యూనిట్లకు రూ.6.90 కోట్లు, ఎస్టీలకు 76 యూనిట్లకు రూ.2.66 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు . కులాంతర వివాహాలు చేసుకున్న 44 ఎస్సీ జంటలకు రూ.1.10 కోట్ల ఆర్థిక సహాయం మంజూరైంది. ఐదు ఎస్సీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి రూ.2.25 కోట్లు వెచ్చిస్తున్నట్లు అధికారులు తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్వో జయశ్రీ, వేములవాడ ఆర్డీవో కేఎస్‌బీ కుమారి, డీఎస్పీలు నాగేంద్రచారి, శ్రీనివాసులు, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్‌రెడ్డి, సీపీఓ శ్రీనివాసాచారి, జిల్లా ఎస్టీ సంక్షేమ శాఖ అధికారి సంగీత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్నతో పాటు వివిధ శాఖల అధికారులు, సంక్షేమ అధికారులు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## మాధురి రాథోడ్ ఫిర్యాదు.. ఈశ్వర్ సాయిపై పోలీసు కేసు

**బలగం టీవీ, హైదరాబాద్:**



మాధురి రాథోడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈశ్వర్ సాయిపై నార్సింగి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి తనతో సన్నిహితంగా మెలిగి, తనను శారీరకంగా వాడుకొని మోసం చేశాడని మాధురి రాథోడ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఈశ్వర్ సాయిపై మోసానికి సంబంధించిన సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుతం ఈశ్వర్ సాయి పరారీలో ఉన్నట్లు పోలీసులు భావిస్తుండగా, అతని ఆచూకీ కోసం రెండు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు సమాచారం.

ఇదిలా ఉండగా, ఇటీవల ఓ హోటల్ రూంలో మాధురి రాథోడ్‌తో కలిసి ఉన్న సమయంలో ఈశ్వర్ సాయి తన భార్యకు పట్టుబడిన ఘటన కూడా చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటన అనంతరం తనపై వచ్చిన ఆరోపణల్లో తన తప్పేమీ లేదని ఈశ్వర్ సాయి చెప్పుకునే ప్రయత్నం చేసినట్లు సమాచారం. తాజాగా మాధురి రాథోడ్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేయడంతో ఈ వ్యవహారం మరోసారి వెలుగులోకి వచ్చింది. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.



## రచయితలు కూడా సమాజానికి వైద్యులే

**– డాక్టర్ గుండ్లూరి సురేంద్రబాబు**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:**

సమాజ హితం కోరేదే సాహిత్యమని, ఉత్తమ రచనలతో సమాజంలోని రుగ్మతలను తొలగించే సాహిత్యకారులు కూడా సమాజానికి వైద్యులేనని తెలంగాణ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రముఖ పిల్లల వైద్య నిపుణుడు, రచయిత డాక్టర్ గుండ్లూరి సురేంద్రబాబు అన్నారు.

సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సాహిత్యంపై ఒకరోజు శిక్షణ కార్యశాలను నిర్వహించగా, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ సురేంద్రబాబు మాట్లాడుతూ వైద్యులు మందులతో శారీరక రుగ్మతలను నయం చేస్తే.. రచయితలు తమ ఆలోచనాత్మక రచనల ద్వారా సామాజిక రుగ్మతలను తొలగించి ప్రజల్లో చైతన్యం తీసుకొస్తారని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ప్రముఖ కథా రచయిత డాక్టర్ పెద్దింటి అశోక్‌కుమార్ కథలు రాయడం ఎలా అనే అంశంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. నిశిత పరిశీలన, సమాజం పట్ల బాధ్యత, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు ఉత్తమ కథకు పునాదులని వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సారస్వత పరిషత్ సంచాలకులు, రచయిత గరిపల్లి అశోక్, కళాశాల ప్రిన్సిపాల్ విజయ రఘునందన్, తెలుగు అధ్యాపకులు సామల వివేకానంద్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీపీఎస్ రద్దు చేయాలి.. ఓపీఎస్ పునరుద్ధరించాలి

**నల్లబ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయుల నిరసన**

**బలగం టీవీ, ఇల్లంతకుంట**

పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా దాచారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం(ఓపీఎస్)ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాణితో పాటు ఉపాధ్యాయులు తూముకుంట నరేందర్‌రెడ్డి, శ్రీను, సురేష్, శ్రీనివాస్, దావీద్, సంజీవ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.





## ఘనంగా మారంపల్లి రాజయ్య ఉపాధ్యాయుడి ఉద్యోగ విరమణ

**బలగం టీవీ, వేములవాడ:**

వేములవాడ మున్సిపల్ విలీన గ్రామమైన శాత్రజ్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా సుదీర్ఘకాలం సేవలందించిన మారంపల్లి రాజయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని తోటి ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు, విద్యార్థులు, గ్రామస్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ శాసనసభ్యులు ఆరెపల్లి మోహన్ ముఖ్య అతిథిగా హాజరై మారంపల్లి రాజయ్యకు ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. మారంపల్లి రాజయ్య మారుమూల గ్రామమైన రుద్రంగిలో జన్మించి, విద్యను తన జీవితానికి ప్రధాన ఆయుధంగా మలుచుకొని ఎన్నో కష్టనష్టాలను అధిగమించి ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించారని తెలిపారు. విద్యార్థుల పట్ల ఎంతో ఆప్యాయతతో మెలుగుతూ, వారి విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేశారని, ఉపాధ్యాయుడిగా తన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తూ ఎంతోమంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. ఆయన సేవలు, క్రమశిక్షణ, అంకితభావం, సహృదయత తోటి ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచాయని అన్నారు. ఉద్యోగ విరమణ సందర్భంగా మారంపల్లి రాజయ్య మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి విద్యే ప్రధాన ఆయుధమని అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే, బాబాసాహెబ్ అంబేద్కర్ వంటి మహనీయులు సామాజిక సమానత్వం కోసం చేసిన పోరాటాల ఫలితంగానే తనలాంటి ఎంతోమంది విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోగలిగారని పేర్కొన్నారు. విద్య ద్వారా మాత్రమే సమాజంలో సమానత్వం, చైతన్యం, ఆత్మగౌరవం పెంపొందుతాయని అన్నారు.

విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నతమైన లక్ష్యాలను సాధించాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. ఉన్నత విద్యను అభ్యసించి దేశానికి, సమాజానికి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయ వృత్తిలో పనిచేసిన కాలంలో తనకు సహకరించిన అధికారులు, తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు, కుటుంబ సభ్యులకు ఈ సందర్భంగా మారంపల్లి రాజయ్య కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు ఆరెపల్లి మోహన్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుడిగా విద్యార్థులకు మార్గదర్శకత్వం అందిస్తూ సమాజ నిర్మాణంలో భాగస్వామిగా నిలిచిన మారంపల్లి రాజయ్య సేవలు అభినందనీయమని అన్నారు. ఉద్యోగ విరమణ అనేది సేవకు ముగింపు కాదని, ఇకపై కూడా సమాజానికి తన అనుభవాన్ని అందిస్తూ విద్యార్థులకు మార్గదర్శిగా కొనసాగాలని ఆకాంక్షించారు. అనంతరం మారంపల్లి రాజయ్యను తోటి ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు, విద్యార్థులు, గ్రామస్థులు ఘనంగా సన్మానించి జ్ఞాపికలు, పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఆయన భవిష్యత్ జీవితం ఆయురారోగ్యాలతో, ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక కౌన్సిలర్లు, విద్యార్థులు, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# హామీలు అమలు చేయండి.. లేకుంటే ఉద్యమమే..



**-తెలంగాణ ఉద్యమకారులను వెంటనే గుర్తించాలి..**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అలుపెరగని పోరాటం చేసిన ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో ఉద్యమకారులందరినీ ఏకం చేసి రాష్ట్రవ్యాప్తంగా మరో ఉద్యమం చేపడతామని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాజన్న సిరిసిల్ల జిల్లా చైర్మన్ గజ్జెల దేవరాజ్ అన్నారు.రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీవై నగర్‌కు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు మేకల రామచంద్రం అనారోగ్యంతో ఇంటికే పరిమితమైన విషయం తెలుసుకున్న తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ నాయకులు ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా రామచంద్రంకు ఆర్థిక సహాయం అందజేసి ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా గజ్జెల దేవరాజ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో మేకల రామచంద్రం కీలక పాత్ర పోషించారని, రిలే నిరాహార దీక్షలు, సకల జనుల సమ్మె, వంటావార్పు వంటి అనేక కార్యక్రమాల్లో పాల్గొని తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నిరంతరం పోరాడారని పేర్కొన్నారు.తెలంగాణ కోసం జీవితాలను, కుటుంబాలను పణంగా పెట్టి పోరాడిన ఉద్యమకారులు నేడు అనారోగ్యంతో, ఆర్థిక ఇబ్బందులతో జీవించాల్సిన పరిస్థితి రావడం బాధాకరమన్నారు. రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన వారిని ప్రభుత్వం వెంటనే గుర్తించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, పింఛన్, ఉద్యమకారులపై నమోదైన కేసుల ఎత్తివేత, మరణించిన ఉద్యమకారుల కుటుంబాలకు పింఛన్‌తో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చిందని అన్నారు . ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు గడుస్తున్నా కమిటీల పేరుతో కాలయాపన చేయడం సరికాదన్నారు.సెప్టెంబర్ 17లోపు తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి, వారికి ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులందరినీ ఏకం చేసి ఉద్యమకారుల కోసం ఉద్యమం అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఉద్యమకారులకు న్యాయం జరిగే వరకు తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ పోరాటం కొనసాగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఫణి రాజారావు, వికాస్ సమితి జిల్లా అధ్యక్షులు, మాజీ సర్పంచుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు అక్కెనపెల్లి కరుణాకర్, కుసపెల్లి సరస్వతి, సింగారం దేవరాజు, కర్నె లక్ష్మీ, గూగులోతు రేనా, పత్తిపాక పద్మశంకర్, మామిడాల రమణ, నేరల శ్రీకాంత్ గౌడ్, డాక్టర్ ఓదెల శ్రీనివాస్, అఫ్రోజ్, సికిందర్, పవన్, సాయిశరత్, సాయి గౌడ్, చోటు బాబా తదితర ఉద్యమకారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం స్పందించాలి.. హామీలు అమలు చేయాలి

**-రూ.1,000 కోట్లతో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి..**
**- జిల్లా రెడ్డి సేవా సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి**

**బలగం టీవీ,గంభీరావుపేట:**



అసెంబ్లీ ఎన్నికల సమయంలో రెడ్లకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా రెడ్డి సేవా సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. గంభీరావుపేట పట్టణ రెడ్డి సంఘం భవనంలో మంగళవారం రెడ్ల నిరసన దీక్ష పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రూ.1,000 కోట్లతో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్రంలో ఇతర వర్గాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్‌ను మాత్రం ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. అన్ని విభాగాల్లో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలయ్యేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.బాధిత రైతు కుటుంబాలకు అండగా నిలిచే రైతు బీమా పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. రెడ్ల సమస్యలపై ఈ నెల 7న అసెంబ్లీలో ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని అన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే 8న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద పెద్దఎత్తున నిరసన దీక్ష చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పట్టణ రెడ్డి సంఘం అధ్యక్షుడు గడ్డమీది ప్రసాద్‌రెడ్డి, జిల్లా సభ్యులు లక్కిరెడ్డి కమలాకర్‌రెడ్డి, ముత్యాల రాజిరెడ్డి, కామిడి సంజీవరెడ్డి, దేవరెడ్డి, సురేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, అంజిరెడ్డి, రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, కిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## ఆర్‌టీఐ పరిరక్షణ కమిటీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా పిట్టల రాములు

**నియామక పత్రాన్ని అందజేసిన రాష్ట్ర అధ్యక్షుడు ఏలిగండ్ల వెంకటేష్**

**బలగం టీవీ, మానకొండూర్**

సమాచార హక్కు (ఆర్‌టీఐ) చట్టం పరిరక్షణ కమిటీ మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా మండలంలోని పారువెల్ల గ్రామానికి చెందిన పిట్టల రాములు నియమితులయ్యారు. మంగళవారం నాడు ఆర్‌టీఐ పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఏలిగండ్ల వెంకటేష్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా నూతన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిట్టల రాములు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన జాతీయ అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షుడు ఏలిగండ్ల వెంకటేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. సమాచార హక్కు చట్టం పరిరక్షణకు, ప్రజలకు చట్టంపై అవగాహన కల్పించేందుకు తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

# పెన్షన్ విద్రోహ దినోత్సవం సందర్భంగా ఉద్యోగుల నల్లబ్యాడ్జీల నిరసన



**బలగం టీవీ, కాల్వశ్రీరాంపూర్**

పెన్షన్ విద్రోహ దినోత్సవం సందర్భంగా మండల పరిషత్, రెవెన్యూ ఉద్యోగులు మంగళవారం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, తహసీల్దార్ రాపెల్లి రాముడు, తెలంగాణ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రంగు రవి మాట్లాడుతూ.. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పెండింగ్ డీఏలు, బిల్లులు విడుదల చేయాలి

ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను వెంటనే విడుదల చేయాలని కోరారు. పీఆర్సీని తక్షణమే అమలు చేయడంతో పాటు వివిధ కారణాలతో నిలిచిపోయిన ఉద్యోగుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల ఆర్థిక భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగ సంఘాలు ఐక్యంగా ప్రజాస్వామ్య పద్ధతిలో తమ పోరాటాన్ని కొనసాగిస్తాయని తెలిపారు.

కార్యక్రమంలో ఎంపీడీవో సురేందర్‌కుమార్, ఆర్‌ఏలు వినోద్, రాజేశ్, జీపీవోలు, ఎంపీఎస్‌వో శ్రీవాణి, ఉద్యోగులు యాసిన్, మహేందర్, సందీప్, శ్రీధర్, భాగ్యలక్ష్మి, రమ్య, కిరణ్, రమ, శ్రీకాంత్, సంపత్, శ్రీనివాస్, అశోక్, సతీశ్, సునీల్, మంజుల, షాబోద్దీన్, తాజ్, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ మెరుపుదాడి

**-ఐదుగురు పట్టివేత.. రూ.9,400 నగదు స్వాధీనం**

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:



సిరిసిల్ల పట్టణ బైపాస్ ప్రాంతంలో రామప్ప దేవాలయానికి వెళ్లే మార్గంలో పేకాట ఆడుతున్న స్థావరంపై జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం సాయంత్రం మెరుపుదాడి నిర్వహించారు.టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ వెంకట్రాజం ఆధ్వర్యంలో జరిగిన దాడిలో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.9,400 నగదు, ఐదు మొబైల్ ఫోన్లు, ఒక ఆటో, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకుని సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నటేష్ తెలిపారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

జిల్లాలో పేకాట, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, వాటికి స్థావరాలు ఏర్పాటు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ నటేష్ హెచ్చరించారు . ఈ దాడిలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.



# సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్‌కు 39 మంది వార్డు అధ్యక్షుల నియామకం..

బలగం టీవీ, సిరిసిల్ల:

సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ కమిటీ పరిధిలోని 39 వార్డులకు వార్డు అధ్యక్షులను నియమిస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు నూతనంగా నియమితులైన వార్డు అధ్యక్షులకు సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సూర దేవరాజు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సూర దేవరాజు మాట్లాడుతూ ప్రతి వార్డులో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు, పార్టీ చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు.

నాయకులు, కార్యకర్తల సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయాలని ఆయన కోరారు. పార్టీ బలోపేతానికి వార్డు అధ్యక్షులు క్రియాశీలకంగా పనిచేయాలని సూచించారు. నూతనంగా నియమితులైన 39 మంది వార్డు అధ్యక్షులకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సూర దేవరాజు అభినందనలు తెలిపారు.



RAJANNA SIRCILLA

Near Konda Laxman Bapuji Circle, Bypass Road, Vidyanagar, Rajanna Sircilla Dist. Head Quarters

SANGEETHAM SRINIVAS
President

Date. 31-08-2

THE FOLLOWING NAMES ARE APPOINTED AS SIRICILLA TOWN WARD PRESIDENTS.

| S.NO | WARD NO | NAMES | MOBILE NO |
|---|---|---|---|
| 01 | 01 | ADEPU PRASAD | 8688823453 |
| 02 | 02 | JAKKANI ANJANEYULU | 9290752759 |
| 03 | 03 | MERUGU SHEKAR | 6302413348 |
| 04 | 04 | MANALA MAHESH | 8019883013 |
| 05 | 05 | MALYALA NAGARAJU | 9989061966 |
| 06 | 06 | SIRICILLA RAVINDAR | 9133912019 |
| 07 | 07 | SABBANI VENU | 6302607878 |
| 08 | 08 | SALENDRI VENUGOPAL | 9000900822 |
| 09 | 09 | SURA RAJU | 8179532049 |
| 10 | 10 | GOSKULA MAHENDAR | 9989420885 |
| 11 | 11 | VANGARI ANIL | 9398276063 |
| 12 | 12 | KOLAKANI RAJESHAM | 9705542611 |
| 13 | 13 | THAMMISHETTI CHANDU | 9347819882 |
| 14 | 14 | CHINTAKINDI MALLESHAM | 7013303066 |
| 15 | 15 | THYAGARAJU KOMMU | 9490015125 |
| 16 | 16 | GUJJE RAMESH | 9866181865 |
| 17 | 17 | PAYYAVULA PRAVEEN | 9701195866 |
| 18 | 18 | SIDDAM RAJESH | 9390242113 |
| 19 | 19 | BHAIRI SHIVAPRASAD | 9966740969 |
| 20 | 20 | EPPAPULA LAXMAN | 9100658864 |
| 21 | 21 | SWARGAM SAGAR | 9182638961 |
| 22 | 22 | MANDALA RAJU | 9848180098 |
| 23 | 23 | ARKALA KANAKARAJU | 9440544311 |
| 24 | 24 | AKENI SATHISH | 9959593552 |
| 25 | 25 | VODNALA SRINIVAS | 9959013553 |
| 26 | 26 | CHIPPA PENTAIAH | 9908759350 |
| 27 | 27 | MD ANSAR ALI AHMAD | 9603831438 |
| 28 | 28 | CHERRIPELLI SHIVAPRASAD | 9705129111 |
| 29 | 29 | GAJJELLI ASHOK | 8237680499 |
| 30 | 30 | DUMPETI RAKESH | 8688803968 |
| 31 | 31 | BURLA GANGAIAH | 9014485069 |
| 32 | 32 | PISKA VENKATESH | 9912125795 |
| 33 | 33 | GAJULA SAGAR | 9553522028 |
| 34 | 34 | PAISA ANJANEYULU | 9959054048 |
| 35 | 35 | RACHA MAHESH | 8008392924 |
| 36 | 36 | BHAIRI PRABHAKAR | 7989226809 |
| 37 | 37 | SAMALA RAMESH | 8099708210 |
| 38 | 38 | GORINTALA PRAKASH | 9908351661 |
| 39 | 39 | GOUDA RAJU | 9440394602 |

RAJANNA SIRCILLA DISTRICT CONGRESS COMMITTEE

SANGEETHAM SRINIVAS
President



# నిరుద్యోగులకు ఉచిత శిక్షణ.. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి..

**టీఆర్పీ జిల్లా అధ్యక్షులు దండు వినోద్**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రవేశ పరీక్షలకు సిద్ధమవుతున్న ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఉచిత శిక్షణ అందిస్తున్నామని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షులు దండు వినోద్ తెలిపారు. మంగళవారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం లో దండు వినోద్ మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ అఖిల్ పాషా ఆధ్వర్యంలో, తీన్మార్ మల్లన్న సూచనల మేరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఈ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నమని అన్నారు .

ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు ఎస్ఐ, కానిస్టేబుల్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, తదితర ప్రవేశ పరీక్షలకు ఉచితంగా సన్నద్ధమయ్యేందుకు 'టీఆర్పీ సుమార్గ్' కార్యక్రమం ద్వారా అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. పరీక్ష ఫీజులు చెల్లించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.హిస్టరీ ఫ్యాకల్టీ కరీమ్ రాజు ఆధ్వర్యంలోని బృందం విద్యార్థులకు అవసరమైన అన్ని సబ్జెక్టుల్లో శిక్షణ అందించడంతో పాటు ఉద్యోగం సాధించే వరకు సహకారం అందించేందుకు ముందుకొచ్చిందని తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగం సాధించడం నిరుద్యోగ యువతకు, వారి కుటుంబాలకు ఎంతో భావోద్వేగంతో కూడుకున్న అంశమని,తల్లిదండ్రుల త్యాగాలు, కష్టానికి ఫలితంగా ఉద్యోగాన్ని భావించే యువతకు సరైన మార్గదర్శకత్వం, శిక్షణ అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రవేశ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఈ ఉచిత శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 6305176073 నంబర్‌కు సంప్రదించి ఉచితంగా నమోదు చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు కలికోట రేణుక. పట్టణ అధ్యక్షులు అరుకాల రమేష్. కోడూరి శ్రీహరి. బిట్ల జోష్న. చెన్నోజి విద్యాసాగర్. మొగిల్ల బాబు. పోతుల గాంధీబాబు. గాలి శ్రీనివాస్. కుసుమ చంద్రశేఖర్. మెరుగు వేణు. అవధూత వెంకటేష్. తదితరులు పాల్గొన్నారు

# ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి

**-ప్రభుత్వ సబ్సిడీ, ఆర్థిక ప్రయోజనాలను వివరించాలి..**

**-కలెక్టర్ గరిమ అగ్రవాల్**

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:



ఆయిల్ పామ్ సాగుతో రైతులకు కలిగే లాభాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, సబ్సిడీలపై విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఉద్యానవన, వ్యవసాయ శాఖ అధికారులు, కంపెనీల ప్రతినిధులతో మంగళవారం ఆయిల్ పామ్ సాగు పురోగతిపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఇప్పటివరకు 960 ఎకరాల్లో ఆయిల్ పామ్ దిగుబడి విక్రయించి రైతుల ఖాతాల్లో రూ.3.45 కోట్లు జమ అయినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఆయిల్ పామ్ టన్ను ధర రూ.24,025గా ఉందని వివరించారు.2026-27 సంవత్సర లక్ష్యాలను చేరుకునేలా మొక్కల నాటడం, డ్రిప్ ఇరిగేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మొక్కల సరఫరా, డ్రిప్ ఏర్పాటు ప్రక్రియల్లో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

సమావేశంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఆర్. శరత్‌బాబు, జిల్లా వ్యవసాయ అధికారిణి అఫ్జల్ బేగం తదితరులు పాల్గొన్నారు.

**భూముల రీసర్వే వేగవంతం చేయాలి**

జిల్లాలో భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని,లైసెన్స్ సర్వేయర్ల సంఖ్యను పెంచి, అవసరమైన రోవర్ యంత్రాలను సమకూర్చుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి మంగళవారం రీసర్వే పురోగతిపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. గంభీరావుపేట శ్రీనివాసపురం, వేములవాడ అర్బన్ చంద్రగిరి, కోనరావుపేట లచ్చపేట, చందుర్తి అనంతపల్లి గ్రామాల్లో సర్వే పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

మరో పది మండలాల్లోని వివిధ గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. గ్రామాల సరిహద్దు సర్వేను సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, రెవెన్యూ, అటవీ శాఖలు సంయుక్తంగా చేపట్టి, భూముల వివరాలను ఎలాంటి తప్పులకు తావులేకుండా నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.సంబంధిత అధికారులు రీసర్వే జరుగుతున్న గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రక్రియను పరిశీలించాలని సూచించారు. సమావేశంలో ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, అధికారులు, సర్వేయర్లు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటలతో నిరంతర ఆదాయం



**– జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

బలగం టీవీ,తంగళ్లపల్లి :

ప్రత్యామ్నాయ పంటల సాగుతో రైతులకు నిరంతర ఆదాయం లభించడంతో పాటు వాతావరణ పరిస్థితులు, నీటి సమస్యలను అధిగమించే అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు.ప్రతి మంగళవారం నిర్వహించే క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా తంగళ్లపల్లి మండలం దేశాయిపల్లి గ్రామంలో కంకణాల రమేష్, కంకణాల రాజు సాగు చేస్తున్న కూరగాయలు, పూల తోటలను కలెక్టర్ పరిశీలించారు. దాదాపు నాలుగు ఎకరాల్లో బీరకాయ, టమాట, మిర్చి, సొరకాయ, బంతి సాగు చేస్తున్న రైతులను అభినందించారు.కంకణాల రాజు సుమారు రెండున్నర ఎకరాల్లో బీరకాయ, సొరకాయతో పాటు మల్చింగ్ విధానంలో అంతర పంటగా టమాట, మిర్చి, బంతి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం బీరకాయ పంట చేతికి రావడంతో దిగుబడి, విక్రయాలు, ఆదాయం, సస్యరక్షణ చర్యలపై కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం, వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులు వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు, కూరగాయలు సాగు చేయాలని సూచించారు. ఒకే పంటపై ఆధారపడకుండా వివిధ రకాల పంటలు సాగు చేస్తే క్రమం తప్పకుండా ఆదాయం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ఉద్యానవన, వ్యవసాయ శాఖల ద్వారా అందుతున్న ప్రభుత్వ సహాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బీరకాయ సాగులో ఎకరానికి రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చులు పోను ఆదాయం వస్తోందని రైతు కంకణాల రాజు తెలిపారు. నాటిన 45 రోజుల నుంచి పంట చేతికి రావడం ప్రారంభమై మరో 45 రోజుల నుంచి రెండు నెలల వరకు దిగుబడి వస్తుందని చెప్పారు. త్వరలో టమాట, మిర్చి, బంతి పంటల ద్వారా కూడా ఆదాయం లభించనుందని అన్నారు .

**పాంపాండ్‌తో నీటి భద్రత**

రాజు గత ఏడాది తన పొలంలో గుంట విస్తీర్ణంలో పాంపాండ్ నిర్మించుకున్నారు. వర్షాకాలంలో అందులో నీరు నిల్వ ఉండటంతో భూగర్భ జలాలు పెరిగి బోరులో సమృద్ధిగా నీరు లభిస్తోందని తెలిపారు. డ్రిప్ పద్ధతిలో పంటలకు నీటిని అందిస్తున్నట్లు చెప్పారు.

**చేపల పెంపకంతో అదనపు ఆదాయం**

పాంపాండ్‌లో కొరమీను, రవు చేప పిల్లలను పెంచుతూ అదనపు ఆదాయం పొందుతున్నారు. సహజ పద్ధతిలో చేపలను పెంచి ఆరు నెలలకు ఒకసారి విక్రయించడం ద్వారా సుమారు రూ.40 వేల వరకు ఆదాయం వస్తోందని రైతు తెలిపారు. కలెక్టర్ వెంట జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి లక్ష్మీనారాయణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, ఉద్యానవన శాఖ అధికారి శరత్‌బాబు తదితరులు ఉన్నారు.

# నేత్రదానానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి

**– జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :



మరణానంతరం నేత్రదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని,ఒకరి నేత్రదానం ద్వారా ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించే అవకాశం ఉందని

కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు.41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు నిర్వహిస్తున్న 15 రోజుల అవగాహన కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో నేత్రదానంపై రూపొందించిన అవగాహన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ కంటి దానం మహాదానం అని, నేత్రదానంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కుటుంబ సభ్యులతో చర్చించి మరణానంతరం నేత్రదానం చేసేందుకు ముందుకొచ్చేలా ప్రజలను చైతన్యపరచాలని సూచించారు.నేత్రదానం ప్రాముఖ్యత, విధానాలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. యువత, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలను నేత్రదాన ఉద్యమంలో భాగస్వాములను చేయాలని అన్నారు .నేత్రదానం చేయాలనుకునే వారి మరణం సంభవించిన ఆరు గంటల్లోపు 98495 45822 నంబర్‌కు శ్రీనివాస్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం నేత్రాలను సేకరించి నేత్రనిధికి పంపిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్, డీసీహెచ్ఎస్ డాక్టర్ సుభాషిణి, కార్యక్రమ అధికారులు డాక్టర్ నాగేందర్‌బాబు, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా అంధత్వ నియంత్రణ కార్యక్రమ అధికారి డాక్టర్ నయీమ్‌జహా తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ కార్యాలయంపై దాడి.. ప్రజాస్వామ్యంపై దాడే..



**-దాడులకు పాల్పడితే చూస్తూ ఊరుకోం..**

**-బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :

నాంపల్లిలోని బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి ఆధ్వర్యంలో మంగళవారం సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ బీజేపీ కార్యాలయంపై దాడి అత్యంత అప్రజాస్వామిక చర్య అని, రాజకీయంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో బీజేపీని ఎదుర్కొనే ధైర్యం లేకే పార్టీ కార్యాలయంపై దాడికి పాల్పడ్డారని అన్నారు. పార్టీ కార్యాలయంపై దాడి చేయడం అంటే బీజేపీపై మాత్రమే దాడి చేయడం కాదని, ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడి చేయడమేనని అన్నారు.

దాడి జరుగుతున్న సమయంలో విధుల్లో ఉన్న పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అధికార పార్టీ కార్యకర్తలు దాడులకు పాల్పడుతుంటే పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించడం ఆందోళనకరమన్నారు. దాడికి పాల్పడిన వారిని గుర్తించి వెంటనే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాజకీయ ప్రత్యర్థులను విధానాలతో, ప్రజల తీర్పుతో ఎదుర్కోవాలే తప్ప దాడులు, దౌర్జన్యాలతో కాదన్నారు. అధికారంలో ఉన్నామనే అహంకారంతో ప్రతిపక్ష పార్టీల కార్యాలయాలు, నాయకులు, కార్యకర్తలపై దాడులు చేస్తే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

నల్గొండ జిల్లాలో బీజేపీ జిల్లా అధ్యక్షుడి ఇంటిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఈ ఘటనపై ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, అధికార పార్టీకి చెందిన వారైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే పోలీసులు సమానంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటిస్తున్నారని, దానిని చేతకానితనంగా భావించవద్దని గోపి హెచ్చరించారు. ఇకపై బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ కార్యాలయాలపై దాడులకు పాల్పడితే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. రాజకీయ హింసకు స్వస్తి పలికి ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని, దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ నిరసనలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి, జిల్లా కార్యదర్శులు కర్నె హరీష్, మీసా సంజీవ్, జిల్లా కోశాధికారి ఆసాని రామలింగారెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఉడుగుల యాదగిరి, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కిరణ్ నాయక్, ధార్మిక సెల్ కన్వీనర్ డాక్టర్ సత్యనారాయణ, పట్టణ, మండల అధ్యక్షులు, జిల్లా పదాధికారులు, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తోన్న మోడీ సర్కారు

**ప్రజల సొమ్మును ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తోంది**

**పేదలు, రైతుల రుణాలు మాఫీ చేయాలి**

**సీపీఐ మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :




కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తులకు పట్టం కడుతూ ప్రజల సొమ్మును ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తోందని సీపీఐ మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి ఆరోపించారు. కరీంనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకుల్లో తీసుకున్న సుమారు రూ.22 వేల కోట్ల రుణాలను కార్పొరేట్ శక్తులకు మాఫీ చేసిన కేంద్ర ప్రభుత్వం.. పేదలు, రైతులు తీసుకున్న రుణాలను మాత్రం మాఫీ చేయడం లేదని విమర్శించారు. దేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలపై దాడులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

**తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించాలి**

తెలంగాణ ప్రాంతానికి గోదావరి జలాలు ఎంతో అవసరమని, ఎత్తిపోతల ద్వారానే రాష్ట్రానికి నీటిని అందించాలనే సంకల్పంతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జలయజ్ఞానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఆ సమయంలో శాసనసభలో సీపీఐ సంపూర్ణ మద్దతు తెలిపిందన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు శంకుస్థాపనలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎమ్మెల్యేలంతా భాగస్వాములయ్యారని గుర్తుచేశారు.

తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మిస్తే శాశ్వతంగా సాగు, తాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. ఆదిలాబాద్‌తో పాటు ఉత్తర తెలంగాణ జిల్లాలు సస్యశ్యామలం అవుతాయని పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్రంలో, మహారాష్ట్రలో బీజేపీ ప్రభుత్వాలే అధికారంలో ఉన్నందున బ్యారేజీ నిర్మాణంపై మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చించేందుకు తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్ చొరవ చూపాలని కోరారు.

**22ఏతో భూ సమస్యలు**

2021లో ధరణి పోర్టల్ చట్టం తీసుకొచ్చిన సమయంలోనే అందులో అనేక లోపాలు ఉన్నాయని, భవిష్యత్‌లో సమస్యలు ఉత్పన్నమవుతాయని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు స్పష్టంగా చెప్పినా పట్టించుకోలేదని చాడ వెంకటరెడ్డి అన్నారు. సెల్‌ఫోన్లకే వైరస్ వచ్చి డేటా పోయే పరిస్థితి ఉన్నప్పుడు, పోర్టల్‌కు వైరస్ వస్తే భూముల డేటా పరిస్థితి ఏమిటని అప్పట్లో హెచ్చరించామని గుర్తుచేశారు.

ప్రస్తుతం 22ఏ కారణంగా రాష్ట్రవ్యాప్తంగా అనేక భూ సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. మల్కాజిగిరి సహా పలు ప్రాంతాల్లో భూములు 22ఏ జాబితాలోకి వెళ్లడంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. నిషేధిత భూములకు అక్రమంగా పట్టాలు చేయించుకునే రియల్ ఎస్టేట్ దందాలను అరికట్టాలని, వ్యవసాయ భూములను సైతం అక్రమాలకు గురిచేస్తున్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**అధికార యంత్రాంగాన్ని ప్రక్షాళన చేయాలి**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధి, ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశంతో పనిచేస్తున్నప్పటికీ అధికార యంత్రాంగంలో కొందరు విధులు, బాధ్యతల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని చాడ వెంకటరెడ్డి అన్నారు. పరిపాలనలో జవాబుదారీతనం తగ్గిపోతోందని, అవినీతి విచ్చలవిడిగా పెరిగిందని ఆరోపించారు.

రెవెన్యూ, ఇంజనీరింగ్, పోలీస్ తదితర శాఖల్లో ఏసీబీకి చిక్కుతున్న కొందరు ఉద్యోగుల వద్ద భారీగా అక్రమ ఆస్తులు బయటపడుతున్నాయని అన్నారు. భూముల బదలాయింపులు, ఇతర పనుల కోసం వచ్చే ప్రజలు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుంచి అధికారులు పెద్ద మొత్తంలో లంచాలు తీసుకుంటున్నారని ఆరోపించారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే చొరవ తీసుకుని అధికార యంత్రాంగాన్ని ప్రక్షాళన చేయాలని సూచించారు. అవసరమైతే అనుభవజ్ఞులైన రాజకీయ విశ్లేషకులు, రిటైర్డ్ అధికారులతో సంప్రదింపులు జరిపి పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచాలని, అవినీతికి తావులేని వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు.

**ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలకు తరలిరావాలి**

సెప్టెంబర్ 6 నుంచి 8వ తేదీ వరకు కరీంనగర్‌లో ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహాసభలను విజయవంతం చేసేందుకు కార్మిక లోకం పెద్దఎత్తున తరలిరావాలని చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు.

విలేకరుల సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్‌కుమార్, బోయిని అశోక్, టేకుమల్ల సమ్మయ్య, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, న్యాలపట్ల రాజు, జిల్లా కౌన్సిల్ సభ్యులు కటికరెడ్డి బుచ్చన్నయాదవ్, పైడిపల్లి రాజు, కసిరెడ్డి మణికంఠరెడ్డి, మచ్చ రమేష్, నాయకులు బాకం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఈస్ట్ జోన్

**డిఫెండింగ్ ఛాంపియన్ సెంట్రల్ జోన్‌పై ఘన విజయం**

**రజత్ పాటిదార్ సేనకు నిరాశ..**

**4 వికెట్ల తేడాతో ఇషాన్ కిషన్ బృందం విజయం**

బలగం టీవీ, హైదరాబాద్

దేశవాళీ క్రికెట్ సీజన్‌లో తొలి టోర్నీ అయిన దులీప్ ట్రోఫీలో ఈస్ట్ జోన్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో దుమ్మురేపిన ఈస్ట్ జోన్.. బిసిసిఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ మైదానంలో జరిగిన హోరాహోరీ సెమీఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ సెంట్రల్ జోన్‌పై 4 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. వైభవ్ సూర్యవంశీ, కెప్టెన్ ఇషాన్ కిషన్ బ్యాటింగ్‌లో మెరవగా, పేసర్ ముకేష్ కుమార్ బౌలింగ్‌లో ఆకట్టుకోవడంతో డిఫెండింగ్ ఛాంపియన్ సెంట్రల్ జోన్ ఇంటిదారి పట్టింది.



**స్వల్ప లక్ష్యం.. ఈస్ట్ జోన్ మెరుపులు:**

రెండో ఇన్నింగ్స్‌లో సెంట్రల్ జోన్ నిర్దేశించిన 159 పరుగుల స్వల్ప లక్ష్య ఛేదనలో ఈస్ట్ జోన్ ఓపెనర్లు అభిమన్యు ఈశ్వరన్ (24), వైభవ్ సూర్యవంశీ (40) ధనాధన్ బ్యాటింగ్‌తో బలమైన పునాది వేశారు. ప్రత్యర్థి బౌలర్ హర్ష్ దూబే (4/53) నాలుగు వికెట్లు తీసి తిప్పేసినా, గాయం నుంచి కోలుకొని బరిలోకి దిగిన కెప్టెన్ ఇషాన్ కిషన్ (39) బాధ్యతాయుత మెరుపు ఇన్నింగ్స్‌తో జట్టును విజయతీరాలకు చేర్చాడు. చివర్లో మహమ్మద్ షమీ విన్నింగ్ షాట్‌తో జట్టుకు విజయాన్ని అందించాడు.

**సెంట్రల్ జోన్ తడబాటు:**

అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో రింకూ సింగ్ (60) రాణించడంతో సెంట్రల్ జోన్ 266 పరుగులు చేసింది. అనంతరం ఈస్ట్ జోన్ కూడా తొలి ఇన్నింగ్స్‌లో సరిగ్గా 266 పరుగులకే ఆలౌటైంది. అయితే రెండో ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు సాధించాలనుకున్న సెంట్రల్ జోన్‌ను ఈస్ట్ జోన్ బౌలర్లు ముకేష్ కుమార్ (3/56), అభిజిత్ సర్కార్ (3/38) తీవ్రంగా దెబ్బతీశారు. దీంతో రజత్ పాటిదార్ సేన రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 158 పరుగులకే పరిమితమైంది.

సంక్షిప్త స్కోర్లు:

సెంట్రల్ జోన్ తొలి ఇన్నింగ్స్: 266 ఆలౌట్ (రింకూ సింగ్ 60).

ఈస్ట్ జోన్ తొలి ఇన్నింగ్స్: 266 ఆలౌట్ (హర్ష్ దూబే 4/66).

సెంట్రల్ జోన్ రెండో ఇన్నింగ్స్: 158 ఆలౌట్ (ముకేష్ కుమార్ 3/56, అభిజిత్ సర్కార్ 3/38).

ఈస్ట్ జోన్ రెండో ఇన్నింగ్స్: 159/6 (వైభవ్ సూర్యవంశీ 40, ఇషాన్ కిషన్ 39; హర్ష్ దూబే 4/53).

ఫలితం: 4 వికెట్ల తేడాతో ఈస్ట్ జోన్ విజయం.

# ఫైనల్ వైపు సౌత్ జోన్



**అజేయ శతకంతో మెరిసిన తిలక్ వర్మ.. తొలి ఇన్నింగ్స్‌లో 117 పరుగుల ఆధిక్యం**

**రెండో ఇన్నింగ్స్‌లో పోరాడుతున్న నార్త్ జోన్..**

**నేడే ఆఖరి రోజు!**

బలగం టీవీ, హైదరాబాద్

దులీప్ ట్రోఫీ సెమీఫైనల్-2 పోరులో నార్త్ జోన్‌పై సౌత్ జోన్ తమ పట్టును బిగించింది. కెప్టెన్, 'తెలుగు తేజం' తిలక్ వర్మ (250 బంతుల్లో 9 ఫోర్లతో 116 నాటౌట్) బాధ్యతాయుతమైన అజేయ శతకంతో చెలరేగడంతో సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 117 పరుగుల భారీ ఆధిక్యాన్ని సొంతం చేసుకుంది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నార్త్ జోన్, మూడో రోజు ఆట ముగిసే సమయానికి 66 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 256 పరుగులు చేసింది. ప్రస్తుతం నార్త్ జోన్ 139 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

రాణించిన నార్త్ జోన్ బ్యాటర్లు:

నార్త్ జోన్ రెండో ఇన్నింగ్స్‌లో సనత్ సంగ్వాన్ (76), ఆయుష్ దోసెజా (52) హాఫ్ సెంచరీలతో రాణించి జట్టుకు కాస్త ఉపశమనం అందించారు. ప్రస్తుతం క్రీజులో అన్షుల్ కాంబోజ్ (29 బ్యాటింగ్) ఉన్నాడు. సౌత్ జోన్ బౌలర్లలో శ్రేయస్ గోపాల్, కావురి సాయితేజ, మహమ్మద్ నిదీష్ చెరో రెండు వికెట్లు తీయగా, విద్వత్ కావేరప్ప ఒక వికెట్ సాధించాడు.

**తొలి ఇన్నింగ్స్‌లో 312 పరుగులు:**

అంతకుముందు 285/9 ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను కొనసాగించిన సౌత్ జోన్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 100.3 ఓవర్లలో 312 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోరుకు 27 పరుగులు జోడించిన అనంతరం కావురి సాయితేజ (13) అవుట్ కావడంతో సౌత్ ఇన్నింగ్స్ ముగిసింది. తిలక్ వర్మ 116 పరుగులతో నాటౌట్‌గా నిలవగా, శ్రేయస్ గోపాల్ (87) తృటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. నార్త్ జోన్ బౌలర్లలో గుర్నూర్ బ్రార్ (4/88) నాలుగు వికెట్లతో ఆకట్టుకున్నాడు.

సౌత్ జోన్ ఫైనల్ అవకాశాలు సుగమం:

బుధవారం ఈ మ్యాచ్‌కు ఆఖరి రోజు. తొలి సెషన్‌లోనే నార్త్ జోన్ మిగతా 3 వికెట్లను త్వరగా పడగొడితే సౌత్ జోన్ ముందు స్వల్ప లక్ష్యమే నమోదవుతుంది. ఒకవేళ మ్యాచ్ డ్రాగా ముగిసినప్పటికీ, టోర్నీ నిబంధనల ప్రకారం తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ఆధారంగా సౌత్ జోన్ సులువుగా ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది.

సంక్షిప్త స్కోర్లు:

నార్త్ జోన్ తొలి ఇన్నింగ్స్: 195 ఆలౌట్ (ఖ్రమాన్ ఇక్బాల్ 76; విద్వత్ కావేరప్ప 4/64).

సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్: 312 ఆలౌట్ (తిలక్ వర్మ 116 నాటౌట్, శ్రేయస్ గోపాల్ 87; గుర్నూర్ బ్రార్ 4/88).

నార్త్ జోన్ రెండో ఇన్నింగ్స్ (మూడో రోజు ముగిసేసరికి): 256/7 (సనత్ సంగ్వాన్ 76, ఆయుష్ దోసెజా 52; శ్రేయస్ గోపాల్ 2/.. , కావురి సాయితేజ 2/.. , నిదీష్ 2/..).

# వాయుసేన ధైర్యానికి సచిన్ ప్రశంసలు

**'ఆపరేషన్ సఫేద్ సాగర్' చూసిన క్రికెట్ దిగ్గజం**

**కార్గిల్ యుద్ధంలో సైనికుల త్యాగాలను గుర్తుచేసుకున్న సచిన్**

బలగం టీవీ, హైదరాబాద్

భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ భారత వాయుసేనపై ప్రశంసల వర్షం కురిపించారు. కార్గిల్ యుద్ధం నేపథ్యంలో రూపొందిన 'ఆపరేషన్ సఫేద్ సాగర్' సిరీస్‌ను వీక్షించిన అనంతరం వాయుసేన సిబ్బంది ధైర్యసాహసాలు, త్యాగాలను కొనియాడుతూ సచిన్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించారు.

''వాళ్ల త్యాగాల వల్లే ప్రశాంతంగా నిద్రిస్తున్నాం''

'ఆపరేషన్ సఫేద్ సాగర్'ను ఇప్పుడే చూశానని పేర్కొన్న సచిన్.. దేశం కోసం పనిచేస్తున్న సైనికుల జీవితాలు ఎంత భిన్నంగా ఉంటాయో ఈ సిరీస్ తనకు మరోసారి గుర్తుచేసిందన్నారు. ''వారు ఒత్తిడి, అనిశ్చితి మధ్య విధులు నిర్వర్తిస్తుంటే.. మనం ప్రశాంతంగా నిద్రపోతూ రోజువారీ జీవితాన్ని కొనసాగిస్తున్నాం'' అని పేర్కొన్నారు.

బీఎస్ ధనోవాతో భేటీని గుర్తుచేసుకున్న సచిన్

గతంలో ఎయిర్ చీఫ్ మార్షల్ బీఎస్ ధనోవాను కలిసిన విషయాన్ని సచిన్ గుర్తుచేసుకున్నారు. కార్గిల్ యుద్ధ సమయంలో ధనోవా, మరెంతో మంది వాయుసేన సిబ్బంది ఎదుర్కొన్న పరిస్థితులను సిరీస్‌లో చూసిన తర్వాత.. అప్పటి భేటీని మరింత గౌరవభావంతో గుర్తుచేసుకున్నానని తెలిపారు.

వాయుసేన సిబ్బంది ప్రదర్శించిన ధైర్యం అసాధారణమని, దాని వెనుక ఉన్న క్రమశిక్షణ, మానసిక దృఢత్వం కూడా గొప్పవని సచిన్ పేర్కొన్నారు. వాయుసేనతో అనుబంధం కలిగి ఉండటం తన అదృష్టమని తెలిపారు. దేశ ప్రజల కోసం వాయుసేన అందిస్తున్న సేవలకు కృతజ్ఞతలు చెబుతూ ''జైహింద్'' అంటూ తన సందేశాన్ని ముగించారు.






కార్గిల్ యుద్ధం నేపథ్యంలో సిరీస్

'ఆపరేషన్ సఫేద్ సాగర్'లో కార్గిల్ యుద్ధ సమయంలో భారత వాయుసేనకు చెందిన యువ అధికారులు ఎదుర్కొన్న సవాళ్లను చూపించారు. గోల్డెన్ యారోస్ స్క్వాడ్రన్ కేంద్రంగా రూపొందిన ఈ సిరీస్‌లో అత్యంత ఎత్తైన ప్రాంతాల్లో నిర్వహించిన వైమానిక దాడులు, సైనికుల ధైర్యం, ఒత్తిడి, త్యాగాలతోపాటు వారి వ్యక్తిగత అనుభవాలను ఆవిష్కరించారు.

# న్యూజిలాండ్ పర్యటనకు 'ఇండియా-ఎ' జట్టు

**టెస్టు సిరీస్‌కు ముందు మూడు 4 రోజుల మ్యాచ్‌లు**

**అక్టోబర్ 24 నుంచి క్రైస్ట్‌చర్చ్ వేదికగా సిరీస్ ప్రారంభం**

బలగం టీవీ, ముంబై:

న్యూజిలాండ్‌తో జరిగే కీలక టెస్టు సిరీస్‌కు సమాయత్తమయ్యేందుకు బిసిసిఐ ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రధాన భారత జట్టు పర్యటనకు ముందే 'ఇండియా-ఎ' జట్టును న్యూజిలాండ్‌కు పంపనుంది. అక్టోబర్ 24 నుంచి క్రైస్ట్‌చర్చ్ వేదికగా 'న్యూజిలాండ్-ఎ' జట్టుతో ఇండియా-ఎ మూడు 4 రోజుల (ఫోర్-డే) మ్యాచ్‌ల సిరీస్‌లో తలపడనున్నట్లు న్యూజిలాండ్ క్రికెట్ (ఎన్జెడ్‌సి) మంగళవారం అధికారికంగా ప్రకటించింది.



**సన్నద్ధత కోసమే ఎ-సిరీస్:**

న్యూజిలాండ్ తమ దేశవాళీ రెడ్ బాల్ టోర్నీ 'ప్లెంకెట్ షీల్డ్' షెడ్యూల్‌ను ప్రకటిస్తూ ఈ మ్యాచ్‌ల వివరాలను వెల్లడించింది. "అంతర్జాతీయ స్థాయి నాణ్యమైన క్రికెట్‌ను అందించేందుకు న్యూజిలాండ్-ఎ, ఇండియా-ఎ జట్ల మధ్య మూడు 4 రోజుల మ్యాచ్‌లను నిర్వహిస్తున్నాం" అని ఎన్జెడ్‌సి తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. భారత్ సీనియర్ జట్టు అక్కడ ఆడబోయే రెండు టెస్టుల సిరీస్‌కు ముందు, క్లిష్టమైన పిచ్‌లు, వాతావరణ పరిస్థితులకు అలవాటు పడేందుకు ఈ ఎ-సిరీస్ ఎంతగానో ఉపయోగపడనుంది.

**అక్టోబర్-నవంబర్‌లో సీనియర్ల పర్యటన:**

భారత సీనియర్ క్రికెట్ జట్టు అక్టోబర్-నవంబర్ నెలల్లో న్యూజిలాండ్‌లో పర్యటించనుంది. ఈ పర్యటనలో భాగంగా భారత్ 5 టీ20లు, 5 వన్డేలతో పాటు 2 టెస్టు మ్యాచ్‌లు ఆడనుంది. తొలి టెస్టు నవంబర్ 19 నుంచి 23 వరకు వెల్లింగ్టన్‌లో జరగనుండగా, రెండో టెస్టు నవంబర్ 27 నుంచి డిసెంబర్ 1 వరకు క్రైస్ట్‌చర్చ్‌లో జరుగుతుంది. కాగా, ప్రస్తుతం ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో న్యూజిలాండ్ మూడో స్థానంలో, భారత్ ఐదో స్థానంలో కొనసాగుతున్నాయి. గత 2024-25 సీజన్ భారత పర్యటనలో న్యూజిలాండ్ 3-0తో చారిత్రాత్మక క్లీన్‌స్వీప్ సాధించిన సంగతి తెలిసిందే.

'ఇండియా-ఎ' మ్యాచ్‌ల షెడ్యూల్:

వేదిక: క్రైస్ట్‌చర్చ్

ప్రారంభ తేదీ: అక్టోబర్ 24, 2026

ఫార్మాట్: 3 (నాలుగు రోజుల మ్యాచ్‌లు)

# అఫ్ఘాన్‌తో టీ20 సిరీస్‌కు భారత జట్టు ప్రకటన

**కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్.. వైస్ కెప్టెన్‌గా తిలక్ వర్మ**

**బుమ్రా, నితీష్ రెడ్డి సహా నలుగురి రీఎంట్రీ.. కానీ ఫిట్‌నెస్ నిరూపించుకోవాల్సిందే!**

బలగం టీవీ, హైదరాబాద్

అఫ్గానిస్థాన్‌తో జరగనున్న మూడు టీ20ల సిరీస్ కోసం 15 మంది సభ్యులతో కూడిన భారత జట్టును బీసీసీఐ ప్రకటించింది. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో ఎంపిక చేసిన ఈ జట్టు వివరాలను మంగళవారం సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. తెలుగు తేజం తిలక్ వర్మకు వైస్ కెప్టెన్ బాధ్యతలు అప్పగించారు. గాయాల కారణంగా కొన్నాళ్లుగా జట్టుకు దూరంగా ఉంటున్న స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా, ఆల్‌రౌండర్లు నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, పేసర్ హర్షిత్ రాణాలు తిరిగి జట్టులోకి వచ్చారు. అయితే, ఈ నలుగురు ఆటగాళ్లు ఫిట్‌నెస్ పరీక్షలో నెగ్గితేనే తుది జట్టులో కొనసాగుతారని బీసీసీఐ స్పష్టం చేసింది.




సంజూ రీఎంట్రీ.. హార్దిక్‌కు మళ్లీ దక్కని చోటు:

వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ తిరిగి టీమిండియాలోకి అడుగుపెట్టగా.. అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్, శివమ్ దూబే, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్ సింగ్‌లు తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. కాగా, స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఈ సిరీస్‌కు కూడా దూరమయ్యాడు. ప్రాక్టీస్ సమయంలో కాలికి గాయం కావడం వల్లే అతడిని ఎంపిక చేయలేదనే ప్రచారం జరుగుతున్నప్పటికీ, బీసీసీఐ మాత్రం హార్దిక్ ఫిట్‌నెస్‌పై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. నితీష్ రెడ్డి పునరాగమనంతో సూర్యాన్ష్ షెడ్గే చోటు కోల్పోగా.. బుమ్రా, రాణాల రాకతో గుర్నూర్ బ్రార్, ప్రిన్స్ యాదవ్, యష్ ఠాకూర్‌లకు అవకాశం దక్కలేదు.

న్యూఢిల్లీ వేదికగా మ్యాచ్‌లు:

అఫ్గానిస్థాన్ క్రికెట్ బోర్డు ఆతిథ్యమిస్తున్న ఈ మూడు టీ20ల సిరీస్ సెప్టెంబర్ 13, 15, 17 తేదీల్లో న్యూఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా జరగనుంది. అఫ్గానిస్థాన్‌లో తగిన మౌలిక వసతులు లేకపోవడంతో ఆ జట్టు భారత్, దుబాయ్ వేదికలను తమ హోమ్ గ్రౌండ్స్‌గా ఉపయోగిస్తున్న సంగతి తెలిసిందే.

**అఫ్ఘాన్‌తో టీ20 సిరీస్‌కు భారత జట్టు:**

శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), సంజూ శాంసన్ (వికెట్ కీపర్), శివమ్ దూబే, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్ సింగ్, జస్‌ప్రీత్ బుమ్రా*, హర్షిత్ రాణా*, నితీష్ కుమార్ రెడ్డి*, వాషింగ్టన్ సుందర్*.





## శార్దూల్ ఠాకూర్‌కు మరో షాక్

**ముంబై కెప్టెన్సీ నుంచి తొలగింపు**

**రంజీ ట్రోఫీకి సిద్దేశ్ లాడ్ సారథ్యం**

బలగం టీవీ, హైదరాబాద్

భారత క్రికెటర్ శార్దూల్ ఠాకూర్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. పేలవ ప్రదర్శనతో ఇప్పటికే భారత జట్టులో చోటు కోల్పోయిన అతడిని ముంబై క్రికెట్ సంఘం (ఎంసీఏ) కెప్టెన్సీ నుంచి తప్పించింది. రంజీ ట్రోఫీ 2026 సీజన్‌కు ముందే ఈ కీలక నిర్ణయం తీసుకున్న ఎంసీఏ.. శార్దూల్ స్థానంలో అనుభవజ్ఞుడైన మిడిలార్డర్ బ్యాటర్ సిద్ధేశ్ లాడ్‌ను సారథిగా నియమించింది.

శార్దూల్‌పై పనిభారం తగ్గించడంతోపాటు రెడ్‌బాల్ క్రికెట్‌లో పేసర్‌గా అతడి సేవలను సమర్థంగా వినియోగించుకోవాలనే ఉద్దేశంతోనే కెప్టెన్సీ నుంచి తప్పించినట్లు ఎంసీఏ వర్గాలు తెలిపాయి. అజింక్యా రహానే అన్ని ఫార్మాట్లకు వీడ్కోలు పలికిన నేపథ్యంలో.. జట్టును సమర్థంగా నడిపించగల అనుభవజ్ఞుడి కోసం ఎంసీఏ సిద్ధేశ్ లాడ్‌ను ఎంపిక చేసింది.

నిలకడైన ప్రదర్శనతో సారథ్య బాధ్యతలు

2013 నవంబర్‌లో ముంబై తరఫున ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన సిద్ధేశ్ లాడ్ దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా రాణిస్తున్నాడు. జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు కీలక ఇన్నింగ్స్‌లు ఆడుతూ 'మిస్టర్ డిపెండబుల్'గా గుర్తింపు పొందాడు. గత రంజీ సీజన్‌లో 8 మ్యాచ్‌ల్లో 774 పరుగులు సాధించిన అతడు.. ఐదు సెంచరీలు, ఒక అర్ధశతకంతో ఆకట్టుకున్నాడు.

2022-23 సీజన్‌లో గోవా తరఫున ఆడిన సిద్ధేశ్.. ఏడాది తర్వాత ముంబైకి తిరిగి వచ్చాడు. 2024-25 సీజన్‌లో మళ్లీ ముంబై తరఫున బరిలోకి దిగాడు.

43వ టైటిల్ వారసత్వం కొనసాగించేనా?

అజింక్యా రహానే సారథ్యంలో ముంబై రంజీ ట్రోఫీని గెలుచుకుని రికార్డు స్థాయిలో 43వసారి ఛాంపియన్‌గా నిలిచింది. ఇప్పుడు 34 ఏళ్ల సిద్ధేశ్ లాడ్ ఆ విజయాల వారసత్వాన్ని కొనసాగించాలనే లక్ష్యంతో ముంబై జట్టును నడిపించనున్నాడు.

2026 రంజీ ట్రోఫీ అక్టోబర్ 11న ప్రారంభం కానుంది. ఎలైట్ గ్రూప్-డీలో ముంబైతో పాటు చండీగఢ్, హర్యానా, రాజస్థాన్, రైల్వేస్, తమిళనాడు, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్ జట్లు ఉన్నాయి. ముంబై తన తొలి మ్యాచ్‌లో చండీగఢ్‌తో తలపడనుంది. శ్రేయాస్ అయ్యర్, సూర్యకుమార్ యాదవ్ అందుబాటులో ఉంటే వైట్‌బాల్ టోర్నీల్లో ముంబైకి సారథ్యం వహించే అవకాశం ఉందని ఎంసీఏ అధికారి ఒకరు వెల్లడించారు.

## చైనా మాస్టర్స్‌లో ఉన్నతి హుడాకు చుక్కెదురు

**తొలి రౌండ్‌లోనే ఓటమి.. హరిహరన్–అర్జున్ రిటైర్**

**బుధవారం బరిలో లక్ష్యసేన్, శ్రీకాంత్**

బలగం టీవీ, హైదరాబాద్

చైనా మాస్టర్స్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. మహిళల సింగిల్స్‌లో ప్రపంచ 25వ ర్యాంకర్ ఉన్నతి హుడా తొలి రౌండ్‌లోనే ఓటమిపాలైంది. పురుషుల డబుల్స్‌లో హరిహరన్ అమ్సకరుణన్–ఎం.ఆర్.అర్జున్ జోడీ తొలి గేమ్ మధ్యలోనే మ్యాచ్ నుంచి వైదొలిగింది.

ప్రపంచ 12వ ర్యాంకర్ కిమ్ గా యున్ (దక్షిణ కొరియా)తో జరిగిన మ్యాచ్‌లో ఉన్నతి 10–21, 18–21తో పరాజయం చవిచూసింది. తొలి గేమ్‌లో భారత షట్లర్ ఏమాత్రం ప్రభావం చూపలేకపోయింది. కిమ్ 4–0తో ఆధిక్యంలోకి వెళ్లి.. అనంతరం 11–3తో ముందంజ వేసి గేమ్‌ను సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లో ఉన్నతి మెరుగైన పోరాటం చేసింది. 8–7, 14–13తో స్వల్ప ఆధిక్యాలు సాధిస్తూ ప్రత్యర్థికి గట్టి పోటీ ఇచ్చింది. స్కోరు 18–18కు చేరిన సమయంలో కిమ్ వరుసగా మూడు పాయింట్లు సాధించి మ్యాచ్‌ను ముగించింది.

తొలి గేమ్ మధ్యలోనే వైదొలిగిన జోడీ

పురుషుల డబుల్స్‌లో హరిహరన్ అమ్సకరుణన్–ఎం.ఆర్.అర్జున్ జోడీ చైనాకు చెందిన చెన్ బో యాంగ్–లియు యి జోడీతో తలపడింది. తొలి గేమ్‌లో 8–11తో వెనుకబడిన సమయంలో భారత జోడీ మ్యాచ్ నుంచి వైదొలిగింది. ఇందుకు కారణం అధికారికంగా వెల్లడికాలేదు. అయితే ఫిట్‌నెస్ సమస్య కారణంగానే రిటైర్ అయినట్లు తెలుస్తోంది.

చైనా మాస్టర్స్‌లో బుధవారం భారత షట్లర్లు ఏడు మ్యాచ్‌ల్లో బరిలోకి దిగనున్నారు. భారత అగ్రశ్రేణి ఆటగాళ్లు లక్ష్యసేన్, కిదాంబి శ్రీకాంత్ తదితరులు తమ పోరాటాలను కొనసాగించనున్నారు.

## సెలెక్టర్ పదవికి మిస్బా రాజీనామా!

**సీనియర్ల తొలగింపు, కోచ్ సర్ఫరాజ్ ఉద్వాసనపై ఆగ్రహం**

**లార్డ్స్ టెస్టు ఓటమితో పిసీబీ కఠిన చర్యలు.. 3వ టెస్టుకు హెసన్‌కు బాధ్యతలు**

బలగం టీవీ, ఇస్లామాబాద్:



అనిశ్చితికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే పాకిస్థాన్ క్రికెట్‌లో మరోసారి తీవ్ర అలజడి మొదలైంది. ఇంగ్లండ్ పర్యటనలో లార్డ్స్ వేదికగా జరిగిన రెండో టెస్టులో ఎదురైన ఘోర ఓటమితో ఆగ్రహించిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) అనూహ్య నిర్ణయాలు తీసుకుంది. సిరీస్ మధ్యలోనే జట్టులోని ఏడుగురు ఆటగాళ్లతో పాటు హెడ్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్, బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌లను బాధ్యతల నుంచి తప్పించి స్వదేశానికి పంపించివేసింది. బోర్డు తీసుకున్న ఈ ఏకపక్ష కఠిన చర్యలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ జాతీయ సెలెక్టర్ మిస్బావుల్ హక్ తన పదవికి హఠాత్తుగా రాజీనామా చేశాడు.

**అవమానించారనే మనస్తాపంతో...:**

తాము ఎంపిక చేసిన స్క్వాడ్‌లోని ఆటగాళ్లను, కోచింగ్ సిబ్బందిని బోర్డు ఈ విధంగా అవమానకర రీతిలో తొలగించడాన్ని జీర్ణించుకోలేకపోయిన మిస్బావుల్ హక్ మంగళవారం తన పదవిని వదులుకున్నాడు. నేషనల్ క్రికెట్ అకాడమీ (ఎన్‌సిఏ) బ్యాటింగ్ కోచ్ పదవికి కూడా అతడు గుడ్‌బై చెప్పనున్నట్లు సమాచారం. కాగా, మూడో టెస్టు నిమిత్తం వైట్‌బాల్ కోచ్ మైక్ హెసన్‌కు పీసీబీ రెడ్ బాల్ బాధ్యతలను కూడా అప్పగించింది.